# ప్రజా మాటలు

తెలంగాణ జాతీయ దినపత్రిక

ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు

ప్రచురణ : జగిత్యాల సంపుటి : 05 సంచిక : 188 పేజీలు : 04 వెల రూ. 2 ఆదివారం 11 - 01 - 2026




**ఎస్‌బీఐ ఖాతాదారులకు షాక్.. పెరిగిన ఏటీఎం ఛార్జీలు**

**నగదు విత్‌డ్రాయల్‌పై రూ. 23, ఇతర లావాదేవీలపై రూ. 11 (జీఎస్టీ అదనం)**

# 'ఇన్నోవేషన్ క్యాపిటల్'గా తెలంగాణ



- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు
- తెలంగాణను గ్లోబల్ 'ఇన్నోవేషన్ క్యాపిటల్'గా తీర్చిదిద్దాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పం
- టెక్నాలజీ కేవలం డిగ్రీలకే పరిమితం కాకుండా, దేశ సేవకు, ఆత్మ నిర్భరతకు ఉపయోగపడాలి
- భారత్ ఆధార్, యూపీఐ వంటి 'డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్' ద్వారా ప్రపంచానికి దిక్సూచి
- 'తెలంగాణ ఏఐ ఇన్నోవేషన్ హబ్', 'ఏఐ యూనివర్సిటీ'లు గేమ్ ఛేంజర్‌గా తెలంగాణ ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్

హైదరాబాద్ : తెలంగాణను గ్లోబల్ 'ఇన్నోవేషన్ క్యాపిటల్'గా తీర్చిదిద్దాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. టెక్నాలజీ కేవలం డిగ్రీలకే పరిమితం కాకుండా, దేశ సేవకు, ఆత్మ నిర్భరతకు ఉపయోగపడాలన్నారు. శనివారం బిట్స్ పిలానీ-హైదరాబాద్ క్యాంపస్‌లో నిర్వహించిన 'బిట్స్ అల్యూమ్ని అసోసియేషన్ గ్లోబల్ మీట్ 2026'కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. ఇతర దేశాలు ప్రైవేట్ గుత్తాధిపత్యాన్ని ప్రోత్సహిస్తే, భారత్ మాత్రం ఆధార్, యూపీఐ వంటి 'డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్' ద్వారా ప్రపంచానికి దిక్సూచిగా నిలిచిందన్నారు. దేశంలోనే తొలిసారిగా - మిగతా 2 లో

## రూ.3 వేల కోట్లకు పైగా

# విలువైన భూమికి హైడ్రా రక్షణ




- మియాపూర్ లో రూ.3 వేల కోట్లకు పైగా విలువైన భూమికి హైడ్రా రక్షణ
- మియాపూర్‌లో రూ. 3 వేల కోట్లకు పైగా విలువైన ప్రభుత్వ భూమి స్వాధీనం
- సర్వే నంబర్ 44లో 15 ఎకరాలకు పైగా భూమిని కాపాడిన హైడ్రా
- తప్పుడు పత్రాలతో కబ్జాకు యత్నించినట్లు అధికారుల నిర్ధారణ
- ఆక్రమణల తొలగింపు.. భూమి చుట్టూ ఫెన్సింగ్, బోర్డుల ఏర్పాటు
- కబ్జాకు యత్నించిన వ్యక్తిపై కేసు నమోదు


## హైదరాబాద్-విజయవాడ

# హైవేపై పండుగ రద్దీ



- ఈ రూట్లలో వెళ్తే బెటర్ అంటున్న పోలీసులు
- సంక్రాంతి పండుగ వేళ విజయవాడ హైవేపై భారీ ట్రాఫిక్ జామ్
- పంతంగి టోల్‌ప్లాజా వద్ద కిలోమీటర్ల మేర నిలిచిపోయిన వాహనాలు
- గుంటూరు, ఒంగోలు వైపు వెళ్లేవారికి నాగార్జునసాగర్ హైవే మార్గం సూచన
- విజయవాడ, ఖమ్మం వెళ్లేవారు భువనగిరి మీదుగా వెళ్లాలని తెలిపిన పోలీసులు
- ఆదివారం చౌటుప్పల్ సంతతో రద్దీ మరింత పెరిగే అవకాశం ఉందనిం హెచ్చరిక

హైదరాబాద్ : సంక్రాంతి పండుగ కోసం సొంతూళ్లకు వెళుతున్న ప్రయాణికులతో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి 65 కిక్కిరిసిపోయింది. శనివారం ఉదయం నుంచే రహదారిపై వాహనాలు బారులు తీరాయి. ముఖ్యంగా చౌటుప్పల్ పట్టణం, పంతంగి టోల్‌ప్లాజా వద్ద కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. పండుగ సెలవులు మొదలవడంతో వేలాది మంది ఒకేసారి బయలుదేరడం, దీనికితోడు హైవేపై జరుగుతున్న నిర్మాణ పనులు కూడా తోడవడంతో వాహనాలు నెమ్మదిగా కదులుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రయాణికులు గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుకోకుండా ఉండేందుకు పోలీసులు ప్రత్యామ్నాయ మార్గాలను సూచించారు. గుంటూరు, మాచర్ల, అద్దంకి, ఒంగోలు, నెల్లూరు వైపు వెళ్లే వాహనదారులు - మిగతా 2 లో




## నటుడు విజయ్‌కు సీబీఐ సమన్లు

# ప్రచార వాహనం సీజ్



- కరూర్ సభలో తొక్కిసలాట ఘటనపై సీబీఐ దర్యాప్తు ముమ్మరం
- నటుడు విజయ్‌కు సమన్లు జారీ.. 12న ఢిల్లీలో విచారణ
- విజయ్ ప్రచార వాహనాన్ని స్వాధీనం చేసుకున్న అధికారులు
- ఇప్పటికే పలువురు టీవీకే నేతలు, జిల్లా కలెక్టర్‌ను ప్రశ్నించిన సీబీఐ

హైదరాబాద్ : తమిళ సినీ నటుడు, రాజకీయ నేత విజయ్ చుట్టూ కరూర్ తొక్కిసలాట కేసులో ఉచ్చు బిగుస్తోంది. ఈ కేసుకు సంబంధించి ఈ నెల 12న ఢిల్లీలోని తమ ప్రధాన కార్యాలయంలో విచారణకు హాజరు కావాలని కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) ఆయనకు సమన్లు జారీ చేసింది. గతేడాది జరిగిన ఈ దుర్ఘటనలో 41 మంది మృతి చెందిన నేపథ్యంలో సీబీఐ దర్యాప్తును వేగవంతం చేసింది. ఈ కేసులో భాగంగా విజయ్ ఎన్నికల ప్రచారానికి ఉపయోగించిన బస్సును కూడా సీబీఐ అధికారులు తాజాగా స్వాధీనం - మిగతా 2 లో

## వ్యక్తుల ప్రైవేట్ జీవితాలపై మీడియా సంస్థలు అలా చేయడం సరికాదు

- టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ మహేశ్ గౌడ్
- మహిళా ఐఏఎస్ అధికారిపై ఓ మీడియా సంస్థలో కథనం
- వాస్తవాలకు దూరంగా వార్తలు వస్తున్నాయన్న మహేశ్ గౌడ్
- నిరాధార వార్తలు ప్రచురించడం మానేయాలని హితవు




## జగన్‌కు నాగరికత గురించి తెలిస్తే

# ఇలాంటి ప్రచారం చేయరు

- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు
- మీడియాతో సీఎం చంద్రబాబు చిట్ చాట్
- జగన్‌కు నాగరికత గురించి తెలిస్తే నదులపై దుష్ప్రచారం చేయరని వ్యాఖ్యలు
- రెండు తెలుగు రాష్ట్రాలు నీటి కోసం గొడవ పడొద్దన్న చంద్రబాబు
- పట్టిసీమతోనే రాయలసీమలో ఉద్యాన రంగం అభివృద్ధి చెందిందని వెల్లడి
- గత ప్రభుత్వం రూ.900 కోట్ల బిల్లులు చేసుకుందని ఆరోపణ



అమరావతి : మాజీ ముఖ్యమంత్రి జగన్‌కు నాగరికత గురించి తెలిస్తే నదుల గురించి ఇలా దుష్ప్రచారం చేయరని, అసలు సింధు నాగరికత ఎలా ఏర్పడిందో తెలుసుకుంటే మంచిదని ముఖ్యమంత్రి చంద్రబాబు హితవు పలికారు. ప్రపంచ ప్రఖ్యాత నగరాలైన దేశ రాజధాని దిల్లీ, లండన్ వంటివన్నీ నదీ తీరాల వెంబడే అభివృద్ధి చెందాయన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. నదీ గర్భం, నదీ పరివాహక ప్రాంతంకు కనీస తేడా తెలియకుండా వైసీపీ నేతలు - మిగతా 2 లో

## తెలుగు ప్రజల కోసం

# సహకరించుకుంటాం

- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు
- పట్టిసీమ ద్వారా తమకున్న చిత్తశుద్ధిని చాటుకున్నామన్న సీఎం
- రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యమని స్పష్టం చేసిన చంద్రబాబు
- సింధూ నాగరకత ఎలా వచ్చిందో జగన్ తెలుసుకుంటే మంచిదని హితవు
- జగన్మోహన్‌రెడ్డికి నాగరికత తెలిస్తే నదుల గురించి దుష్ప్రచారం చేయడని సీఎం చంద్రబాబు హితవు
- దేశ రాజధాని ఢిల్లీ సహా ప్రధాన నగరాలు ఎక్కువ నదీ తీరాల వెంబడి ఉండటం వలనే అభివృద్ధి చెందాయన్న చంద్రబాబు



అమరావతి : వైఎస్సార్సీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డికి నాగరికత తెలిస్తే నదుల గురించి దుష్ప్రచారం చేయడని సీఎం చంద్రబాబు హితవు పలికారు. సింధూ నాగరకత ఎలా వచ్చిందో అతను తెలుసుకుంటే మంచిదని చంద్రబాబు ఈ సందర్భంగా అన్నారు. పార్టీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో మీడియాతో నిర్వహించిన ఇష్టాగోష్టిలో సీఎం చంద్రబాబు మాట్లాడారు. దేశ రాజధాని దిల్లీ సహా ప్రధాన నగరాలు ఎక్కువ నదీ తీరాల వెంబడి ఉండటం వలనే అభివృద్ధి చెందాయని సీఎం చంద్రబాబు తెలిపారు. లండన్ సహా ప్రపంచంలోని ప్రఖ్యాతి గాంచిన ప్రముఖ నగరాలు సైతం నదీ పరివాహక ప్రాంతాల్లోనే ఉన్నాయని సీఎం వెల్లడించారు. నదీ గర్భానికి నదీ పరివాహక ప్రాంతానికి తేడా కూడా తెలియకుండా - మిగతా 2 లో

# 'థాంక్యూ డిప్యూటీ సీఎం సార్'

- ఏడాదిన్నరలోనే వంతెన పూర్తి
- 'థాంక్యూ డిప్యూటీ సీఎం సార్' అంటూ ప్లకార్డులు
- గొల్లప్రోలులో సుద్దగడ్డ వాగుపై వంతెనను పరిశీలించిన పవన్
- గొల్లప్రోలులో స్థానిక చిన్నారులతో ముచ్చటించిన పవన్‌కల్యాణ్
- జిల్లా పోలీసు కార్యాలయంలో ఉన్నతాధికారులతో పవన్‌కల్యాణ్ సమీక్ష
- బ్రిడ్జి లేక వర్షాలు, వరదలు వచ్చినప్పుడు ఇబ్బందులు పడుతున్నామంటూ ఏడాదిన్నర కిందట ప్రజలు పవన్ దృష్టికి
- కాకినాడ జిల్లాలో శాంతి భద్రతలు, నేరాల నియంత్రణపై చర్చ
- విద్యావంతులు కులమతాలకు అతీతంగా ఆలోచించాలని డిప్యూటీ సీఎం కోరారు



అమరావతి : కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ రెండో రోజూ పర్యటించారు. గొల్లప్రోలులో సుద్ధగడ్డ వాగుపై నిర్మించిన నూతన వంతెనను పవన్ పరిశీలించారు. బ్రిడ్జి లేక వర్షాలు, వరదలు వచ్చినప్పుడు ఇబ్బందులు పడుతున్నామంటూ ఏడాదిన్నర కిందట ప్రజలు పవన్ దృష్టికి తీసుకెళ్లారు. సమస్యను విన్న పవన్ వంతెన కడతామంటూ హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారమే ఏడాదిన్నరలోనే వంతెన పూర్తి చేసి అందుబాటులోకి తెచ్చారు. వంతెన నిర్మాణం పూర్తి చేయడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. థాంక్యూ డిప్యూటీ సీఎం సార్ అంటూ చిన్నారులు ప్లకార్డులు పట్టుకుని కృతజ్ఞతలు తెలిపారు. పిల్లలతో పవన్ కాసేపు ముచ్చటించారు. అనంతరం కాకినాడ వెళ్లిన పవన్ జిల్లా పోలీసు కార్యాలయంలో ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. కాకినాడ జిల్లాలో శాంతి భద్రతలు, నేరాల నియంత్రణపై చర్చించారు. సామాజిక మాధ్యమాల్లో అసభ్యకర పోస్టులు అదుపు చేయడంపై సూచనలు చేశారు. ఈ సమావేశంలో ఇన్‌ఛార్జి కలెక్టర్ అపూర్వ భరత్ పాల్గొన్నారు. మానవతాదృక్పథంతో - మిగతా 2 లో

# సంపాదకీయం

## మత్తులో ప్రజాస్వామ్యం!



గత ఒక్క ఏడాదే రాష్ట్ర ఖజానాలోకి రూ.30,188కోట్ల ఆదాయం మద్యం అమ్మకాల ద్వారా వచ్చిపడింది. ఇది కేవలం పది నెలల ఆదాయం మాత్రమే! ఒక మనిషి సంవత్సరంలో 11,351 రూపాయలు కేవలం మద్యం కోసమే ఖర్చు చేస్తున్నాడు! ప్రభుత్వానికి 30శాతం ఆదాయం మద్యం నుంచే వస్తున్న పరిస్థితిలో, ఇదే బావుంది అని ఇలాగే కొనసాగితే, ప్రజల ప్రాణాలూ, కుటుంబాల భవిష్యత్తూ అంతా తాకట్టు పెట్టినట్లే.దేశ జనాభాలో 75శాతం మంది దళితబహుజన, మైనార్టీ, పేద ప్రజలే. మద్యం విధ్వంసానికి గురయ్యేది వీరే. ధనికుడికి మద్యం ఒక అలవాటు; పేదవాడికి మద్యం ఒక జీవిత శిక్ష. అతని తాగుడులో కరిగిపోతున్నది తన పిల్లల చదువుతో పాటు, తన భార్య భద్రత, తన తల్లిదండ్రుల గౌరవం కూడా. మద్యం కుటుంబాలను కూల్చడమే కాదు ప్రజాస్వామ్యాన్నే మత్తులో ముంచుతుంది. ప్రజలను ఆలోచించకుండా, నిజాయితీగల వారిని ఎన్నుకోకుండా చేసే స్థితికి నెట్టేస్తోంది. ఓటు అనే ఆయుధం బాటిల్‌కు లొంగుతున్న ఫలితంగా క్రిమినల్ కేసుల్లో ఇరుక్కున్నవారు చట్టసభలలోకి ప్రవేశిస్తున్నారు. ఇక, మద్యం వల్ల వచ్చే సమస్యలు, వ్యాధులు, ప్రమాదాలు, హింసలకు చికిత్స పేరుతో ఆసుపత్రుల్లో లక్షల బిల్లులు వేస్తున్నారు. మద్యం వ్యాధి అప్పు పేదరికం మళ్లీ మద్యం ఈ చక్రం నుంచి పేద కుటుంబం బయటపడే దారే లేకుండా పోతోంది. మద్యం మత్తులో నేరాలు పెరుగుతున్నాయి. స్త్రీలపై అత్యాచారాలు, హత్యలు, కుటుంబ వ్యవస్థ పతనం... ఇవన్నీ ఈ విధ్వంసక వ్యవస్థ ఫలితాలే. ఈ మద్యం విధానం వెనుక మరో ఘోరమైన అన్యాయం ఉంది.ఆదివాసీలు, గిరిజనులు తరతరాలుగా తయారుచేసే ఇప్ప సారా, గ్రామాలలో గీతకార్మికులు గీసే సంప్రదాయ కల్లు వంటివి ప్రజల ఆరోగ్యానికి హానికరం అన్నది అబద్ధం. ఆధునిక వైద్య పరిశోధనలు కూడా వాటి ఔషధ విలువలను గుర్తించాయి. కానీ అంతర్జాతీయ కంపెనీలు, అగ్రకుల ధనికవర్గ రాజకీయాలు కలిసి ఈ సంప్రదాయాలను “విషం”గా ముద్ర వేసి నాశనం చేశాయి. ప్రపంచంలోని చాలా దేశాల్లో, ముఖ్యంగా సౌదీ అరేబియా, లిబియా, కువైట్, సోమాలియా, మౌరిటేనియా, సూడాన్, పాకిస్థాన్, బ్రూనై, మాల్దీవులు, బంగ్లాదేశ్ వంటి దేశాలలో మద్యం మీద పూర్తి నిషేధాలు లేదా తీవ్ర నియంత్రణలు అమల్లో ఉన్నాయి. కొన్ని దేశాలలో పరిమిత సడలింపులు ఉన్నా, ప్రజల ఆరోగ్యం, సమాజ భద్రతే ప్రభుత్వ విధానాల ప్రధాన లక్ష్యంగా ఉంది.‘మద్యం లేకుండా పాలన సాధ్యం కాదు’ అనే వాదన అబద్ధం మాత్రమే కాదు అది పాలకుల అలసత్వానికి, లాభపరత్వానికి కప్పిన ముసుగు. ఇది అభివృద్ధి కాదు, మెజారిటీ ప్రజలపై అమలవుతున్న శాంతమైన హత్యా విధానం. తుపాకీతో చంపితే నేరం, మద్యం విధానంతో సమాజాన్ని కూల్చితే పాలన ఇదే ఈ వ్యవస్థ అసలు ముఖం.

## జగన్‌కు నాగరికత గురించి తెలిస్తే ఇలాంటి ప్రచారం చేయరు

**మొదటిపేజీ తరువాయి** – మాట్లాడుతున్నారని ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు తమకు బుద్ధి చెప్పినా రాజధాని విషయంలో ఇప్పటికీ విషం చిమ్మడం మానలేదని విమర్శించారు. శనివారం అమరావతిలోని ఎన్టీఆర్ భవన్‌లో మీడియాతో చిట్ చాట్ లో మాట్లాడిన చంద్రబాబు, పలు కీలక అంశాలపై తన అభిప్రాయాలను పంచుకున్నారు.నీటి విషయంలో రెండు తెలుగు రాష్ట్రాల మధ్య గొడవలు పడితే అంతిమంగా నష్టపోయేది తెలుగు ప్రజలేనని చంద్రబాబు స్పష్టం చేశారు. “రెండు తెలుగు రాష్ట్రాలు బాగుండేలా చూడటం తప్పెలా అవుతుంది? తెలంగాణతో కలిసి సహకరించుకుని మిగులు జలాలను సద్వినియోగం చేసుకుంటే రాష్ట్రాలు సుభిక్షంగా ఉంటాయి“ అని సూచించారు. నీటిని సమర్థవంతంగా వాడుకోవడం వల్లే రాయలసీమ స్వరూపం మారిందని, పట్టిసీమ ప్రాజెక్టు ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణ అని గుర్తుచేశారు. ఆ ప్రాజెక్టు ఫలితంగానే రాయలసీమలో ఉద్యాన విస్తీర్ణం గణనీయంగా పెరిగిందని, ప్రస్తుతం దేశంలోనే ఉద్యాన (హార్టికల్చర్) రంగంలో ఏపీ మొదటి స్థానంలో ఉందని గర్వంగా చెప్పారు. రానున్న పదేళ్లలో ప్రపంచంలోనే నెంబర్ వన్ స్థానానికి చేరుకుంటామని ధీమా వ్యక్తం చేశారు.గత ప్రభుత్వం కేవలం స్వార్థ రాజకీయాల కోసం రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును పూర్తి చేయకుండా ఆపేసిందని చంద్రబాబు తీవ్రంగా విమర్శించారు. 2020లో కేవలం మట్టి పనులు చేసి రూ.900 కోట్ల బిల్లులు చేసుకున్నారని ఆరోపించారు. తమ ప్రభుత్వ హయాంలో నీటి విషయంలో రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యమని, ఎవరితోనూ రాజీపడే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. రాబోయే రెండేళ్లలో రాష్ట్రంలో నీటి కొరత అనేదే లేకుండా చూసేందుకు పక్కా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని చంద్రబాబు భరోసా ఇచ్చారు.

## ఒడిశాలో కూలిపోయి చార్టర్డ్ విమానం

**మొదటిపేజీ తరువాయి** – ఒడిశాలో చార్టర్డ్ విమానం కూలిపోయింది. రూర్కెలా నుంచి భువనేశ్వర్‌కు ప్రయాణిస్తున్న తొమ్మిది సీట్ల విమానం టేకాఫ్ అయిన కొద్దిసేపటికి ప్రమాదానికి గురైంది. ఈ దుర్ఘటన జరిగిన సమయంలో విమానంలో పైలట్‌తో సహా మొత్తం ఏడుగురు వ్యక్తులు ఉన్నారు. ఈ ప్రమాదంలో ఆరుగురు ప్రయాణికులకూ గాయాలు కాగా, వారిని సమీప ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.సుందర్‌గఢ్ జిల్లాలోని కన్సార్ ప్రాంతంలో ఈ చార్టర్డ్ విమానం కూలిపోయినట్లు అధికారులు తెలిపారు. ప్రమాదానికి గల కారణాలు ఇంకా నిర్ధారణ కాలేదు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.

## రూ.3 వేల కోట్లకు పైగా విలువైన భూమికి హైడ్రా రక్షణ



**మొదటిపేజీ తరువాయి** – రంగారెడ్డి జిల్లా మియాపూర్‌లోని వేల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూమిని హైడ్రా అధికారులు కాపాడారు. శేరిలింగంపల్లి మండలం, మక్తా మహబూబ్‌పేటలోని సర్వే నంబర్ 44లో ఉన్న సుమారు రూ. 3 వేల కోట్లకు పైగా విలువైన 15 ఎకరాల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకున్నారు. ఈ భూమి కబ్జాకు గురవుతోందని గతంలోనే హైడ్రా ప్రజావాణికి ఫిర్యాదులు అందాయి. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాల మేరకు అధికారులు గతంలోనే ఐదు ఎకరాలను స్వాధీనం చేసుకుని, చెరువు కట్టపై నిర్మించిన 18 అక్రమ షెట్టర్లను తొలగించారు. అయితే, ఇదే భూమికి సంబంధించి అక్రమ రిజిస్ట్రేషన్లు జరిగాయని, సంబంధిత సబ్-రిజిస్ట్రార్ సస్పెన్షన్‌కు గురయ్యారనే వార్తల నేపథ్యంలో హైడ్రా అధికారులు మరోసారి విచారణ చేపట్టారు.ఈ విచారణలో, సర్వే నంబర్ 159కి చెందిన పత్రాలను ఉపయోగించి సర్వే నంబర్ 44లోని మొత్తం 43 ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని అధికారులు నిర్ధారించారు. ఈ క్రమంలో ఎకరంన్నర భూమిని కబ్జా చేసిన ఇమ్రాన్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేశారు.తాజాగా పూర్తిస్థాయిలో రంగంలోకి దిగిన హైడ్రా, ఆక్రమణలను తొలగించి, భూమి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసింది. ఇది ప్రభుత్వ భూమి అని స్పష్టం చేస్తూ హెచ్చరిక బోర్డులను సైతం ఏర్పాటు చేసింది.

# ‘థాంక్యూ డిప్యూటీ సీఎం సార్‘



**మొదటిపేజీ తరువాయి** – వైద్యులు ప్రజా సేవ చేయాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సూచించారు. డాక్టర్లు ఎంత బిజీగా ఉన్నా నెలలో ఒక్కసారైనా గిరిజన ప్రాంతాలు, పల్లెలకు వెళ్లి పేదలకు వైద్య సేవలందించాలని కోరారు. చదువుకున్న వాళ్లంతా కులమతాలకు అతీతంగా ఆలోచించాలన్నారు. కాకినాడ రంగరాయ వైద్యకళాశాల పూర్వవిద్యార్థుల సమ్మేళనానికి పవన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాంకోసలో ఆధునీకీకరణ పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం వైద్యులతో ముఖాముఖి నిర్వహించారు. కళాశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు ఎంతో కృషి చేస్తున్నారంటూ పవన్ ప్రశంసలు కురిపించారు.ఈ సందర్భంగా వైద్యులతో పవన్ ముఖాముఖి నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు వైద్యసేవలు అందించాలని కోరారు. వైద్య నిపుణులు తమ సేవలు విస్తరించాలని ఆయన సూచించారు. విద్యావంతులు కులమతాలకు అతీతంగా ఆలోచించాలని డిప్యూటీ సీఎం కోరారు. కళాశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు ఎంతో కృషి చేస్తున్నారంటూ పవన్ ప్రశంసించారు. వైద్యులు మానవతాదృక్పథంతో ప్రజా సేవ చేయాలని సూచించారు. డాక్టర్లు ఎంత బిజీగా ఉన్నా నెలలో ఒకసారైనా గిరిజన ప్రాంతాలకు వెళ్లాలిని అన్నారు.“రంగరాయ వైద్యకళాశాల కాకినాడ జిల్లాకు మూలస్థంభం. ఈ క్యాంపస్ నుంచి బయటకు వెళ్లిన ప్రతీ విద్యార్థి డాక్టర్‌గా మాత్రమే కాదు. మంచి మనిషిగా నిలబడాలి అన్నదే కళాశాల ఉద్దేశ్యం. పూర్వ విద్యార్థులు అందరూ రూ.10 కోట్ల 11 లక్షల వ్యయంతో నిర్మించబోయే భవనంలో బయో కెమిస్ట్రీ విభాగం పరిపాలన కార్యాలయాలు, లెక్చరల్ హాళ్లు, నర్సింగ్ ల్యాబ్ వంటి అధునాతన సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నారు. ప్రతీ కాలేజీలో పూర్వ విద్యార్థులు ఇలా చేస్తే గనక ఏ కాలేజీలు ప్రైవేట్ పర్వం చేయాల్సిన అవసరం రాదు. మీ కృషి రాబోయే తరాలకు స్ఫూర్తిగా నిలుస్తోంది.‘

# తెలుగు ప్రజల కోసం సహకరించుకుంటాం

**మొదటిపేజీ తరువాయి** – వైఎస్సార్సీపీ నేతలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. గత ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పినా సరే రాజధానిపై విషం చిమ్మటం మానట్లేదని సీఎం చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు.రాష్ట్రంలో రానున్న 2 ఏళ్లలో నీటి కొరత లేకుండా ప్రణాళికలను సిద్ధం చేస్తున్నామని చంద్రబాబు తెలిపారు. నీటిని సద్వినియోగం చేసుకోవడం వలనే రాయలసీమలో హార్టికల్చర్ అభివృద్ధి చెందిందని వివరించారు. దేశంలోనే ఉద్యానవన రంగంలో మొదటి స్థానంలో ఉన్న మనం రానున్న మరో పదేళ్లలో ప్రపంచంలోనే నెంబర్ 1 స్థానానికి వెళ్తామని స్పష్టం చేశారు. తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్ లో సీఎం మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు.నీటి విషయంలో గొడవలకు పోతే నష్టపోయేది తెలుగు ప్రజలే అని ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు. రెండు తెలుగురాష్ట్రాలు బాగుండేలా చూడటం తప్పెలా అవుతుందని ప్రశ్నించారు. మిగులు జలాల్ని సద్వినియోగం చేసుకుంటే రాష్ట్రాలు సుభిక్షంగా ఉంటాయని వెల్లడించారు. రాయలసీమకు నీరందించా మనటానికి పట్టిసీమ ప్రత్యక్ష ఉదాహరణ అన్నారు. పట్టిసీమ ద్వారా రాయలసీమ పట్ల తమకున్న చిత్తశుద్ధిని చాటుకున్నామని తెలిపారు. 2020లో నిలిపిన



రాయలసీమ లిఫ్ట్‌తో స్వార్థ రాజకీయాలు చేస్తున్నారని చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు.ఆ ప్రాజెక్టు ఫలితంగానే ఉద్యానరంగం అభివృద్ధి చెందిందన్నారు. పూర్తి చేయకుండా 2020లోనే నిలిపివేసిన రాయలసీమ లిఫ్ట్ తో స్వార్థరాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. కేవలం మట్టిపనులు చేసి రూ.900 కోట్లు బిల్లులు చేసుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రయోజనాలే తమకు ముఖ్యం, నీటి విషయంలో రాజీపడేది లేదని స్పష్టం చేశారు.ప్రపంచంలో అభివృద్ధి చెందిన అనేక నగరాలన్నీ నదుల ఒడ్డునే ఉన్నాయని మంత్రి నారాయణ అన్నారు. నదీగర్భంలో అమరావతి అంటున్న వైఎస్ జగన్‌ది అవగాహనారాహిత్యమేనని మంత్రి నారాయణ అసహనం వ్యక్తం చేశారు. రివర్ బెడ్‌కి, రివర్ బేసిన్‌కు తేడాను జగన్ తెలుసుకోవాలని వివరించారు నారాయణ ఈ సందర్భంగా వివరించారు. అంతేకాకుండా హైదరాబాద్ సచివాలయంతో పోల్చి విమర్శించడం సరికాదని, అటువంటి వాదనలను మానుకోవాల్సిందిగా మంత్రి నారాయణ వైఎస్సార్సీపీ నేతలకు సూచించారు. హైదరాబాద్ సచివాలయం మంత్రులు, కార్యదర్శులకే పరిమితమని నారాయణ స్పష్టం చేశారు. అదే అమరావతిలో అయితే శాఖాధిపతులు, వారి సిబ్బంది ఒకేచోట ఉంటారని నారాయణ గుర్తు చేశారు. ఎంతో దూరదృష్టితో అమరావతిని నిర్మిస్తున్నారని సీఎం చంద్రబాబు మంత్రి నారాయణ ఈ సందర్భంగా కొనియాడారు.నదీ జలాల విషయంలో తెలుగు రాష్ట్రాలు గొడవలు పెట్టుకుంటే ప్రయోజనం ఏమీ ఉండదని సీఎం చంద్రబాబు పునరుద్ఘాటించారు. మన వద్ద నీళ్లు మిగిలితే తెలంగాణ కూడా వాడుకోవచ్చని వివరించారు. రాష్ట్ర ప్రయోజనాల విషయంలో రాజీ పడబోమని ఈ సందర్భంగా సీఎం స్పష్టం చేశారు. అయితే గత కొద్ది రోజులుగా చంద్రబాబు తెలుగురాష్ట్రాల జల వివాదాలపై తెలుగు రాష్ట్రాల మధ్య గొడవలు వద్దు అని కోరుతూనే ఉన్నారు.

# హైదరాబాద్-విజయవాడ హైవేపై పండుగ రద్దీ

**మొదటిపేజీ తరువాయి** – విజయవాడ హైవేకు బదులుగా నాగార్జునసాగర్ హైవే మీదుగా ప్రయాణించడం మేలని పోలీసులు తెలిపారు. ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) నుంచి బొంగుళూరు గేట్ వద్ద ఎగ్జిట్ తీసుకుని సాగర్ హైవేలోకి ప్రవేశించవచ్చు. ఈ మార్గం కాస్త దూరం ఎక్కువైనా, ట్రాఫిక్ లేకుండా సాఫీగా ప్రయాణం సాగించవచ్చని చెబుతున్నారు. సాధారణ మార్గంలో పంతంగి టోల్‌ప్లాజా వద్ద తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని స్పష్టం చేశారు.అలాగే ఖమ్మం, విజయవాడ వైపు వెళ్లే ప్రయాణికులు భువనగిరి మీదుగా ప్రయాణించాలని అధికారులు సూచిస్తున్నారు. ఓఆర్ఆర్ మీదుగా ఘట్‌కేసర్ వద్ద ఎగ్జిట్ తీసుకుని వరంగల్ హైవేపైకి చేరుకుని, అక్కడి నుంచి భువనగిరి, రామన్నపేట మీదుగా చిట్యాలకు చేరుకోవచ్చు. చిట్యాల నుంచి నార్కట్‌పల్లిని దాటితే ట్రాఫిక్ కష్టాలు చాలా వరకు తగ్గుతాయని వివరిస్తున్నారు. అంతేకాకుండా ఆదివారం చౌటుప్పల్‌లో జరిగే వారంతపు సంతతో రద్దీ మరింత పెరిగే అవకాశం ఉందని పోలీసులు హెచ్చరిస్తున్నారు. పండుగ రద్దీకి సంత కూడా తోడైతే పరిస్థితి తీవ్రంగా మారుతుందని, కాబట్టి ఆదివారం ప్రయాణించే వారు కచ్చితంగా ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని సూచిస్తున్నారు. వాహనదారులు ఓపికతో వ్యవహరించి, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని కోరారు.



## నటుడు విజయ్‌కు సీబీఐ సమన్లు ప్రచార వాహనం సీజ్



**మొదటిపేజీ తరువాయి** – చేసుకున్నారు. సభ జరిగిన రోజు వాహనం ప్రయాణ వివరాలు, అనుమతులు, సమయపాలన వంటి అంశాలను నిర్ధారించుకునేందుకు వాహనాన్ని పరిశీలిస్తున్నట్లు అధికారులు తెలిపారు. బస్సు డ్రైవర్‌ను కూడా ప్రశ్నించి వివరాలు సేకరిస్తున్నారు.గతేడాది సెప్టెంబర్ 27న కరూర్‌లో విజయ్ పార్టీ ‘తమిళగ వెట్రి కళగం’ (టీవీకే) నిర్వహించిన బహిరంగ సభలో అపశ్రుతి చోటుచేసుకుంది. భారీగా జనం తరలిరావడం, జన నియంత్రణ ఏర్పాట్లలో వైఫల్యం కారణంగా తీవ్ర తొక్కిసలాట జరిగి 41 మంది ప్రాణాలు కోల్పోగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారు. నిష్పక్షపాత విచారణ కోసం ఈ కేసును రాష్ట్ర ప్రభుత్వం సీబీఐకి బదిలీ చేసింది.అప్పటి నుంచి దర్యాప్తు ముమ్మరం చేసిన సీబీఐ, నవంబర్ 25న పార్టీ ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్, ఇతర ముఖ్య నేతలను విచారించింది. డిసెంబర్ 4న కరూర్ జిల్లా కలెక్టర్ తంగవేలంను కూడా రెండు గంటల పాటు ప్రశ్నించి, సభకు ఇచ్చిన అనుమతులపై ఆరా తీసింది. ఇప్పుడు నేరుగా విజయ్‌ను విచారించడం ద్వారా సభ నిర్వహణ, భద్రతా ఏర్పాట్లపై కీలక సమాచారం రాబట్టి, బాధ్యులను గుర్తించాలని సీబీఐ భావిస్తోంది.

## ‘ఇన్నోవేషన్ క్యాపిటల్’గా తెలంగాణ




**మొదటిపేజీ తరువాయి** – అందుబాటులోకి తీసుకొచ్చిన ఏఐ ఆధారిత ‘తెలంగాణ డేటా ఎక్స్‌ఛేంజ్’ పరిశోధనలకు గొప్ప ఊతమిస్తోందన్నారు. త్వరలో ప్రారంభించబోయే ‘తెలంగాణ ఏఐ ఇన్నోవేషన్ హబ్’, ‘ఏఐ యూనివర్సిటీ’లు గేమ్ ఛేంజర్‌గా మారి ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్‌గా నిలుస్తాయన్నారు.ప్రస్తుత ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యుగంలో ‘ఇంటెలిజెన్స్’ కంటే ‘కో-ఆర్డినేషన్’ అత్యంత ఖరీదైనదిగా మారిందన్నారు. ఏఐ వినియోగంలో డేటా ప్రైవసీ, ఎథిక్స్‌కు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ఆ దిశగా ఆర్‌అండ్‌డీపై దృష్టి సారించాలని టెక్ కంపెనీలను కోరారు. ఒకప్పుడు స్కేల్, స్పీడ్, వాల్యూయేషన్ ప్రాతిపదికన కంపెనీల సక్సెస్ నిర్ణయించబడేదని.. ఇప్పుడు ఆర్కిటెక్చర్, డేటా ఓనర్ షిప్, డెసిషన్ స్పీడ్, నమ్మకంపైనే వాటి మనుగడ ఆధారపడి ఉందన్నారు. రాబోయే రోజుల్లో కేవలం కోడింగ్ తెలిసిన వారి కంటే, సమస్య మూలాలను గుర్తించి పరిష్కరించగల ‘క్రియేటివ్ థింకర్స్’కే జాబ్ మార్కెట్‌లో డిమాండ్ ఉంటుందని తెలిపారు.ం

**వ్యవసాయం, విద్య, వైద్య రంగాల్లో ఏఐ..**

‘ఏఐ’ ఫలితాలు కేవలం నగరాలకే పరిమితం కాకూడదని, వ్యవసాయం, విద్య, వైద్య రంగాల్లోని గ్రామీణ సమస్యలకు పరిష్కారం చూపేలా పరిశోధనలు జరగాలన్నారు. అప్పుడే టెక్నాలజీ ఫలాలు సామాన్యులకు కూడా అందుతాయన్నారు. ‘తెలంగాణ రైజింగ్’లో భాగస్వామ్యం కావాలని బిట్స్ పిలానీ పూర్వ విద్యార్థులను, యాజమాన్యాన్ని మంత్రి శ్రీధర్ బాబు ఆహ్వానించారు. ఏఐ, ఇన్నోవేషన్, అకడమిక్ రీసెర్చ్ వంటి అంశాల్లో బిట్స్ పిలానీతో కలిసి పని చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో బిట్స్ అలుమ్ని అసోసియేషన్ ఛైర్ పర్సన్ ప్రేమ్ జైన్, మ్యాప్ మై ఇండియా ఫౌండర్ అండ్ చైర్మన్ రాకేష్ వర్మ, బీజీఎం 2026 ఛైర్ పర్సన్ అనిత తదితరులు పాల్గొన్నారు.

# వ్యక్తుల ప్రైవేట్ జీవితాలపై మీడియా సంస్థలు అలా చేయడం సరికాదు



**మొదటిపేజీ తరువాయి** – తెలంగాణకు చెందిన ఓ మహిళా ఐఏఎస్ అధికారిపై ఓ మీడియా సంస్థలో ప్రసారమైన కథనం సంచలనం రేకెత్తించింది. ఈ కథనంపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ విమర్శలు గుప్పించారు. తప్పుడు కథనాలు ప్రసారమవడాన్ని తీవ్రంగా ఖండించారు. వ్యక్తుల ప్రైవేట్ జీవితాలపై చర్చ చేయడం బాధాకరమని, వాస్తవాలకు దూరంగా ఇలాంటి వార్తలు వస్తున్నాయని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంతో కష్టపడి మంత్రులు, అధికారులు ఈ స్థాయికి చేరుకుంటారని, అలాంటి వారిపై నిరాధారమైన వార్తలు ప్రచురించడం మానేయాలని మీడియా సంస్థలకు విజ్ఞప్తి చేశారు. ఈ రోజు గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ మహేశ్ కుమార్ గౌడ్ ఈ వ్యాఖ్యలు చేశారు.అంతేకాకుండా, శ్రీరాముడికి బీజేపీలో సభ్యత్వం ఉందా? అని ప్రశ్నిస్తూ, రాముడి పేరును వాడుకునే హక్కు బీజేపీకి ఎక్కడిది? అని నిలదీశారు. రాజకీయాల్లోకి దేవుడిని లాగడం మంచిది కాదని, ఓట్ల కోసం దేవుడిని వాడుకోవడం సరికాదని హితవు పలికారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో తెలంగాణ యువతకు ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో బీఆర్ఎస్ నేతలు శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మేము రెండేళ్లలో ఎన్ని ఉద్యోగాలు ఇచ్చామో శ్వేతపత్రం విడుదల చేస్తామని చెప్పారు. కేసీఆర్ ఫాం హౌస్‌కే పరిమితమయ్యారని, కవిత వ్యవహారంతో కేటీఆర్, హరీశ్ రావు బాధపడుతున్నారని అన్నారు. కేసీఆర్ కుటుంబ అవినీతి బాగోతంపై కవిత నిజాలు చెబుతున్నారని పేర్కొన్నారు.పంచాయతీ ఎన్నికల్లో 70 శాతం స్థానాలు సాధించామని, కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో విజయం సాధించామని... మున్సిపల్ ఎన్నికల్లో 90 శాతం స్థానాలు గెలుస్తామని మహేశ్ కుమార్ గౌడ్ చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ పార్టీని గెలిపించుకోవాలనే తపన ప్రజల్లో కనిపిస్తోందని అన్నారు.

# ప్రజల సహకారంతోనే నేరాల నివారణ సాధ్యం

**జిల్లా ఎస్పీ అశోక్ కుమార్**

**సంక్రాంతి పండుగకు ఊర్లకు వెళ్లే వారు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలి**

**అనుమానిత వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వండి**

**జగిత్యాల జనవరి 10 (ప్రజా మంటలు) :** సంక్రాంతి పండగ దృష్ట్యా చాలా మంది ప్రయాణాలు చేస్తుంటారు ఇదే అదనుగా దొంగలు చేతివాటం ప్రదర్శిస్తారు ఊళ్లకు వెళ్లే వారు అప్రమత్తంగా ఉండాలని, ముందస్తుగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ ప్రజలకు సూచించారు. ఊరికి వెళ్లే వారు ఇంట్లో ఉన్న నగదు, బంగారు ఆభరణాలు విలువైన వస్తువులను తమ వెంట లేదా.. బ్యాంకు లాకర్ లో అయినా దాచి పెట్టుకోవాలని సూచించారు.చోరీల నియంత్రణకు అన్ని చర్యలు చేపట్టామని, ప్రజలను అప్రమత్తం చేస్తున్నాం అని రాత్రి వేళల్లో గస్తీ ని ముమ్మరశీ చేశామని ఈ విషయంలో జిల్లా పరిధిలోని ప్రజలు కూడా జాగ్రత్తలు తీసుకోని పోలీసు వారికి సహకరించాలని సూచించారు.

**దొంగతనాలు దృష్ట్యా పోలీస్ శాఖ వారి పలు సూచనలులి చేశారు**

ఇంటికి తాళం వేసిన తర్వాత తాళం బయటకు కనిపించకుండా పరదా కప్పి ఉంచాలి. మెయిన్ డోర్ లోపల నుంచి లాక్ చేసి.. పక్క డోర్లకు తాళం వేయడం మంచిదనీ ఊరు వెళ్లేముందు ఇంట్లో బంగారు, వెండి, డబ్బు వంటి విలువైన వస్తువులను బీరువాలో పెట్టకూడదు. బ్యాక్ లాకర్లలో దాచుకోవడం మంచిదనీ తెలిపారు.విలువైన వస్తువులు, వ్యక్తిగత ఆర్థిక విషయాల సమాచారాన్ని ఇతరులతో పంచుకోవద్దన్నారు. బీరువా తాళాలు ఇంట్లో కప్ బోర్డులు లేదా ఇతర ప్రదేశాలలో ఉంచకూడదు. ఊరు వెళితే ఇంటి పక్కనవారికి, సంబంధిత పోలీసులకు సమాచారం అందించడం ద్వారా రాత్రి సమయాల్లో గస్తీ తిరగడానికి వచ్చినప్పుడు ఇంటి పై ప్రత్యేక శ్రద్ధ వహిస్తారన్నారు. రాత్రి సమయంలో ఏదైనా ఒక రూమ్ లో లైట్ వెలుగుతూనే ఉండేలా ఆన్ చేసి ఉంచాలి. అనుమానిత లేదా కొత్త వ్యక్తులు ఇంటి చుట్టూ తిరగడం కనిపిస్తే వెంటనే 100 కి ఫోన్ చేసి సమాచారం ఇవ్వండి.మీ మొబైల్ కి నోటిఫికేషన్ వచ్చేలా.. ఇంటికి సీసీ కెమెరా అమర్చుకోవాలి. ఇంటి బయట నాలుగు దిక్కులు కవర్ అయ్యేలా కెమెరాలు అమార్చుకోవాలని చుట్టుప్రక్కల వారిని తమ ఇంటిని కనిపెట్టి ఉండమని చెప్పి వెళ్లడం, ఇంటికి సంబంధించిన సమాచారం



ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని ఇంట్లో ఎవరైనా మహిళలు, వృద్ధులు వద్దకు అపరిచితులు సమాచారం కావాలంటూ వస్తే నమ్మవద్దని చెప్పాలన్నారు.

# కోరుట్ల పోలీస్ స్టేషన్ ను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ అశోక్ కుమార్

**కోరుట్ల జనవరి 10 (ప్రజా మంటలు) :** జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆకస్మికంగా కోరుట్ల పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించాలని, నేర నియంత్రణకు మరింత పటిష్టమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. స్టేషన్‌లో నిర్వహిస్తున్న కేసు డైరీలు, జనరల్ డైరీ, రిజిస్టర్లు, ఇతర రికార్డులను ఎస్పీ గారు సవివరంగా పరిశీలించి, రికార్డుల నిర్వహణపై తగిన సూచనలు చేశారు. విజిబుల్ పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి సారిస్తూ, స్టేషన్ పరిధిలోని గ్రామాలను తరచూ సందర్శించాలని, ప్రజలకు పోలీసుల అందుబాటు మరింత పెరగాలని ఆదేశించారు.రాబోయే మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉండాలని స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు



చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు.

**ప్రజలతో సత్సంబంధాలు, సైబర్ అవగాహన**

ప్రజలతో మరింత సత్సంబంధాలు పెంచుకోవాలని, ముఖ్యంగా యువతకు సైబర్ నేరాల నివారణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అలాగే రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని ఆదేశించారు. సంక్రాంతి పండుగ సందర్భంగా దొంగతనాల నివారణకు పటిష్ట పెట్రోలింగ్ సంక్రాంతి పండుగ సమయంలో చాలా మంది స్వగ్రామాలకు వెళ్లడం వల్ల ఇళ్లు ఖాళీగా ఉండే అవకాశం ఉందని, ఈ పరిస్థితిని దొంగలు తమకు అనుకూలంగా మలుచుకునే ప్రమాదం ఉన్నందున, పటిష్టమైన పెట్రోలింగ్ నిర్వహించి దొంగతనాలు జరగకుండా చూడాలని ఎస్పీ ఆదేశించారు.ఎస్పీ వెంట డీఎస్పీ రాములు, కోరుట్ల మరియు మెట్‌పల్లి సీఐలు సురేష్, అనిల్ కుమార్, ఎస్ఐ చిరంజీవి ఉన్నారు.

# సంక్రాంతి పండుగకు ఊర్లకు వెళ్లే వారు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి

**అనుమానిత వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలి**

**ఎస్ఐ కృష్ణ సాగర్ రెడ్డి**

**గొల్లపల్లి జనవరి 10 ప్రజా మంటలు :** సంక్రాంతి పండుగను దృష్టిలో ఉంచుకొని ప్రజలు తమ స్వగ్రామాలకు ప్రయాణాలు చేస్తుంటారని, ఈ అవకాశాన్ని దొంగలు ఆసరాగా చేసుకునే ప్రమాదం ఉందని ఎస్ఐ కృష్ణ సాగర్ మండల ప్రజలకు సూచించారు. ఊర్లకు వెళ్లే వారు తప్పనిసరిగా ముందస్తు జాగ్రత్తలు తీసుకొని అప్రమత్తంగా ఉండాలని కోరారు.ఊరికి వెళ్లే ముందు ఇంట్లో ఉన్న నగదు, బంగారు ఆభరణాలు, ఇతర విలువైన వస్తువులను ఇంట్లో ఉంచకుండా తమ వెంట తీసుకెళ్లడం లేదా బ్యాంక్ లాకర్లలో భద్రపరచుకోవాలని సూచించారు. చోరీల నియంత్రణకు పోలీస్ శాఖ అన్ని చర్యలు చేపట్టిందని, రాత్రి వేళల్లో గస్తీని మరింత ముమ్మరం చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మండల ప్రజలు పోలీస్ శాఖకు సహకరించాలని కోరారు.

దొంగతనాల నివారణకు పోలీస్ శాఖ సూచనలు ఇంటికి తాళం వేసిన తర్వాత తాళం బయటకు కనిపించకుండా పరదా లేదా కవరుతో కప్పి ఉంచాలి. మెయిన్ డోర్‌ను లోపల నుంచి లాక్ చేసి, పక్క డోర్లకు తాళం వేయడం మంచిది. ఊరు వెళ్లేముందు బంగారు, వెండి, నగదు వంటి విలువైన వస్తువులను బీరువాలో ఉంచకూడదు. బ్యాంక్ లాకర్లలో భద్రపరచుకోవాలి.విలువైన వస్తువులు, వ్యక్తిగత ఆర్థిక సమాచారం ఇతరులతో పంచుకోవద్దు. బీరువా తాళాలను ఇంట్లో కప్‌బోర్డులు లేదా సులభంగా దొరికే ప్రదేశాల్లో ఉంచకూడదు. ఊరికి వెళ్లే ముందు ఇంటి పక్కనవారికి మరియు సంబంధిత పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలి. అలా చేస్తే గస్తీ సమయంలో ఇంటిపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తారు. రాత్రి సమయంలో ఇంట్లోని ఏదైనా ఒక గదిలో లైట్ వెలుగుతూనే ఉండేలా ఏర్పాటు చేసుకోవాలి. అనుమానాస్పద లేదా కొత్త వ్యక్తులు ఇంటి చుట్టూ తిరుగుతూ కనిపిస్తే వెంటనే 100కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలి.చుట్టుపక్కల వారిని ఇంటిని గమనిస్తూ ఉండమని చెప్పి



వెళ్లాలి. ఇంటికి సంబంధించిన సమాచారం ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఉండాలనీ తెలిపారు.

# విమర్శలకు అభివృద్ధి పనులతో బదులిస్తా

**ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్**





**జగిత్యాల, జనవరి 10 (ప్రజా మంటలు) :** విమర్శలకు అభివృద్ధి పనుల ద్వారానే సమాధానం ఇస్తానని జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ స్పష్టం చేశారు. జగిత్యాల పట్టణంలోని 36, 42, 43 వార్డుల్లో రూ. 1 కోటి 30 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్లు, డ్రైనేజీ అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పట్టణంలో ఎక్కడా సీసీ రోడ్లు, డ్రైనేజీ సమస్యలు లేకుండా శాశ్వత పరిష్కారాల దిశగా పనులు చేపట్టామని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో జగిత్యాల నియోజకవర్గానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అత్యధిక నిధులు మంజూరు చేశారని పేర్కొన్నారు. పట్టణంలోని ప్రతి వార్డులో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని, మొత్తం రూ.25 కోట్లతో పలు పనులు శరవేగంగా జరుగుతున్నాయని చెప్పారు. 4,520 మంది నిరుపేదల కోసం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణం పూర్తయిందని, వాటి పరిసరాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు రూ.34 కోట్లను ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు.నేషనల్ హౌసింగ్ బ్యాంక్ ద్వారా రూ.62.5 కోట్ల రుణం మంజూరైందని, త్వరలో టెండర్ ప్రక్రియ పూర్తిచేసి పనులు ప్రారంభిస్తామని వెల్లడించారు. నిబంధనల ప్రకారం రూ.5 కోట్ల ప్యాకేజీలుగా అభివృద్ధి పనులు చేపట్టి, నాణ్యతతో వేగంగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్లు మన్సూర్, గోలి శ్రీనివాస్, అడువాల లక్ష్మణ్, నాయకులు అహమ్మద్, బోడ్ల రాజు, చెట్పల్లి సుధాకర్, కప్పల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ల్యాండ్‌మార్క్ కియా బోయిన్‌పల్లి షోరూమ్‌లో ఆల్‌న్యూ కియా సెల్టోస్ ఆవిష్కరణ

**ముఖ్య అతిథిగా కేబినెట్ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**




**సికింద్రాబాద్, జనవరి 10 (ప్రజా మంటలు) :** ల్యాండ్‌మార్క్ గ్రూప్ సౌత్ కు చెందిన ల్యాండ్‌మార్క్ కియా సంస్థ బోయిన్‌పల్లి షోరూమ్‌లో ఆల్‌న్యూ కియా సెల్టోస్ కారును తెలంగాణ రాష్ట్ర కేబినెట్ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ శనివారం అధికారికంగా ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ...కియా సంస్థ ప్రవేశపెడుతున్న నూతన వాహనాలు వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా అత్యాధునిక సాంకేతికతతో రూపొందుతున్నాయని పేర్కొన్నారు. ఆటోమొబైల్ రంగంలో కియా సంస్థ విశ్వసనీయతను సంపాదించుకుందని అన్నారు.ఈ కార్యక్రమంలో ల్యాండ్‌మార్క్ గ్రూప్ సౌత్ సీఈఓ మహేంద్రబాబు, ల్యాండ్‌మార్క్ కియా ఏవీపీ సందీప్ కుమార్, ల్యాండ్‌మార్క్ గ్రూప్ డీజీఎం ఏ.ఆర్. రెడ్డి మాట్లాడుతూ... ఆల్‌న్యూ కియా సెల్టోస్‌లోని నూతన ఫీచర్లు, అధునాతన భద్రతా ప్రమాణాలు, ప్రీమియం డిజైన్, మెరుగైన డ్రైవింగ్ అనుభవాన్ని వివరించారు. వినియోగదారులకు అత్యుత్తమ సేవలు అందించడంలో ల్యాండ్‌మార్క్ కియా ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో షోరూమ్ సిబ్బంది, కియా వినియోగదారులు, ఆటోమొబైల్ రంగానికి చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఉపాధి పథకం నుంచి గాంధీ పేరు తొలగింపు చరిత్రకు అవమానం

**సికింద్రాబాద్, జనవరి 10 (ప్రజా మంటలు) :** జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నుంచి మహాత్మా గాంధీ పేరును తొలగించడం అమానుషమైన చర్య అని, ఇది బీజేపీ ప్రభుత్వం ఉద్దేశ్యపూర్వకంగా తీసుకున్న రాజకీయ నిర్ణయమని కాంగ్రెస్



నేతలు తీవ్రంగా మండిపడ్డారు. సీతాఫలమ ండిలో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో కాంగ్రెస్ నాయకులు దీపక్ జాన్, అదం సంతోష్ కుమార్, కోట నీలిమ మాట్లాడారు.మహాత్మా గాంధీ పేరు అహింస, సత్యం, శ్రమకు ప్రపంచవ్యాప్తంగా ప్రతీక అని, అలాంటి మహానీయుడి పేరును పేదలు, కూలీలకు ఉపాధి కల్పించే కీలక పథకం నుంచి తొలగించడం గాంధీ వ్యతిరేక భావజాలానికి నిదర్శనమని విమర్శించారు. శ్రమకు గౌరవం, ప్రతి కుటుంబానికి ఉపాధి హక్కు అనే ఆలోచనలు గాంధీ సిద్ధాంతాల నుంచే పుట్టాయని గుర్తు చేశారు.స్వాతంత్ర్య సమరయోధుల చరిత్రను వక్రీకరించే ప్రయత్నాలు బీజేపీ పాలనలో పెరిగాయని, తాజా నిర్ణయంతో ప్రజల మనోభావాలు దెబ్బతిన్నాయని అన్నారు. కోట్లాది పేద కుటుంబాలకు వెన్నెముకగా నిలిచిన ఈ పథకాన్ని రాజకీయ ద్వేషంతో మార్చడం సరికాదని స్పష్టం చేశారు.గాంధీ పేరు తొలగించే నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ, ఈ అంశంపై దేశవ్యాప్తంగా కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఉద్యమాలు కొనసాగుతాయని తెలిపారు. ఈ సమావేశంలో సురేష్ లాల్, జగ్గు, జాంగిర్, అనిల్, గంట రాజు సాగర్, చక్రధర్, కల్పన, శిల్ప చారి, సందీప్ రాజ్, షకిల్ ఖాన్, అమర్, ఇసాక్, సతీష్, శ్యామ్, జై కుమార్, శ్రీనివాస్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# మండల సర్పంచ్ ఫోరం అధ్యక్షుడికి ఘన సన్మానం



**భీమదేవరపల్లి జనవరి 10 (ప్రజా మంటలు) :** ఇటీవల జరిగిన గ్రామ సర్పంచ్ ఎన్నికల్లో గాంధీనగర్ గ్రామ సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కేతిరి లక్ష్మారెడ్డిని కారుణ్య గ్రూప్ ఆఫ్ సొసైటీ తెలంగాణ జిల్లాల చైర్మన్ తాళ్లపల్లి జయరాజ్ శుభాకాంక్షలు తెలియజేస్తూ శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీకి లక్ష్మారెడ్డి ఎంతోకాలంగా చేసిన సేవలను జయరాజ్ గుర్తు చేశారు. నియోజకవర్గ స్థాయిలో పార్టీని బలోపేతం చేయడంలో ఆయన నిరంతరం కృషి చేశారని, కార్యకర్తల్లో ధైర్యం నింపి ఉత్సాహాన్ని పెంచారని పేర్కొన్నారు. పార్టీ గెలుపులో లక్ష్మారెడ్డి కీలక పాత్ర పోషించారని, ఆయన ఏకగ్రీవ ఎన్నిక కావడం ఎంతో ఆనందకరమని తెలిపారు. అలాగే, లక్ష్మారెడ్డి సేవలను గుర్తించి మండల సర్పంచ్‌లు ఆయనను మండల సర్పంచ్ ఫోరం అధ్యక్షుడిగా ఎన్నుకోవడం అభినందనీయమని జయరాజ్ అన్నారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ సీనియర్ నాయకుడు తాళ్లపల్లి రాజయ్య, తాళ్లపల్లి ఆశీర్వాదం, చిదురాల రాజు తదితరులు పాల్గొన్నారు.

# క్రీడాకారులకు టీ షర్ట్స్ బహుకరించిన 9వ వార్డు సభ్యురాలు బోయిని వెంకటమ్మ

**చిగురుమామిడి జనవరి 10 (ప్రజా మంటలు) :** నవాబుపేట గ్రామంలో సంక్రాంతి పండగ సందర్భంగా గత ఐదు సంవత్సరాలనుండి గ్రామ స్థాయి క్రికెట్ టోర్నమెంట్ జరుగుతుంది. ఈ టోర్నమెంట్ లో 12 జట్లు పాల్గొంటున్నాయి కాగా టోర్నమెంట్ లో పాల్గొంటున్న తన వార్డు జట్టు అయిన బాలగణేష్ టీం



కి వార్డు సభ్యురాలు బొయిని వెంకటమ్మ టీ షర్ట్స్ బహుకరించడం జరిగింది. ఈ సందర్భంగా వెంకటమ్మ మాట్లాడుతూ క్రీడాకారులను ఆట లో ప్రోత్సహిస్తూ వారు బాగ ఆడి వార్డుకి గ్రామానికి మంచి పేరు తేవాలని అభిప్రాయ పడ్డారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన చిగురుమామిడి పృథ్వీధర్ గౌడ్ చైతులమీదుగా జెర్సీ లు క్రీడాకారులకు పంపిణీ చేయడం జరిగింది కార్యక్రమం లో సర్పంచ్ గుళ్ళ రజిత రాజు,ఉపసర్పంచ్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు ఇనుగాల శ్రీనివాస్ రెడ్డి.యువజన నాయకులు బోయినీ ప్రశాంత్ మరియు క్రీడాకారులు పాల్గొన్నారు.

# అల్టిట్యూడ్ పాఠశాలలో ఘనంగా సంక్రాంతి వేడుకలు







**ఎల్కతుర్తి, జనవరి10 ప్రజా మంటలు :** ఎలుకతుర్తి మండల కేంద్రంలోని అల్టిట్యూడ్ పాఠశాలలో సంక్రాంతి పండుగను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రాంగణం అంతా పచ్చని తోరణాలు, రంగురంగుల అలంకరణలతో తెలుగుదనం పొలికపోయేలా పండుగ వాతావరణం నెలకొంది.విద్యార్థులు కొత్త బట్టలు ధరించి ఆటపాటలతో సందడి చేశారు. ఉపాధ్యాయులు పిల్లలకు భోగి పండ్లు పోసి ఆశీర్వదించగా, విద్యార్థులు కైట్లు తెచ్చుకొని ఆనందంగా ఆటలాడారు.ఈ సందర్భంగా విద్యార్థులు రంగురంగుల ముగ్గులు వేసి అందరినీ ఆకట్టుకున్నారు. ముగ్గుల పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు పాఠశాల యాజమాన్యం ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు.పాఠశాల కరస్పాండెంట్ పుష్కారి కార్తీక్ రావు మాట్లాడుతూ, తెలుగు సంస్కృతి సంప్రదాయాలను పిల్లలకు తెలియజేయాలనే ఉద్దేశంతో సంక్రాంతి వేడుకలను నిర్వహిస్తున్నామని తెలిపారు. సంక్రాంతి పండుగ గొప్పతనం, ఎందుకు జరుపుకుంటారు, ఎలా జరుపుకుంటారు అనే విషయాలను విద్యార్థులకు వివరించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ నవీన్, వైస్ ప్రిన్సిపాల్ లింగం మొగిలి, సరిత, ప్రీ ఫైనల్ ఇంచార్జ్ లావణ్య, వ్యాయామ ఉపాధ్యాయుడు కర్రె తిరుపతి, ఆశా బేగం, సురేష్, మమత, కవిత, గీత, శ్రావణి, స్వప్న, అనూష, శ్వేత, రమ్య తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# సమ్మక్క జాతర పనులను పరిశీలించిన మంకని పద్మ చేరలు

**ఎల్కతుర్తి జనవరి 10 ప్రజా మంటలు :** మండల కేంద్రంలోని దామెర గ్రామంలో సమ్మక్క సారలమ్మ జాతర స్థలాన్ని పరిశీలించిన గ్రామ సర్పంచ్ పద్మ చేరాలు. శనివారం దామర గ్రామంలో జరిగే సమ్మక్క జాతర పనులను ప్రారంభించి స్థలాన్ని పరిశీలించినట్లు జాతర కమిటీ సభ్యులు తెలిపారు. గత 25 సంవత్సరాలుగా దామెర



గ్రామంలో సమ్మక్క సారలమ్మ జాతర జరుగుతున్నట్టు సభ్యులు పేర్కొన్నారు. జాతరకు ప్రత్యేక సుమారు పదివేల మంది భక్తులు వస్తున్నారని ఈసారి కూడా భక్తులు వచ్చే అవకాశం ఉందని తెలిపారు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లను చేయనున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రోడ్డబోయిన సంపత్ సాతూరి శంకర్, గొర్రె కుమారస్వామి, ఎడ్ల చంద్రారెడ్డి, రెడ్డబోయిన బిక్షపతి, కడారి ఎల్ల స్వామి, దూడపాక నాగేష్, చిర్రా చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.ద

# వాసవి మాతా ఆలయంలో ఘనంగా లక్ష్మీ గణపతి హవనం



**జగిత్యాల జనవరి 10(ప్రజా మంటలు) :** జిల్లా కేంద్రంలోని వైశ్య భవన్లో వాసవి మాత ఆలయంలో శనివారం లక్ష్మీ గణపతి హోమం ఘనంగా నిర్వహించారూ .ఆలయంలో కొద్ది రోజుల్లో నూతనంగా కృష్ణ శిలతో కూడిన బ్రహ్మసూత్ర శివలింగం, మేధా దక్షిణామూర్తి, వాసవి మాత ,శక్తి గణపతి, దాసాంజనేయ స్వామి విగ్రహాలు ప్రతిష్టించరున్నారు. దీనికిగాను నాందిగా ఈ హవనము నిర్వహించారు. కార్యక్రమానంతరం వేద ఆశీర్వచనము, తీర్థప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. వైదిక క్రతువులు దేశపతి శ్యాంసుందర్ శ్రీ చరణ్ శర్మ ఆదిత్య శర్మ సిరిసిల్ల కేదార్ శర్మ లు కొనసాగించారు. కార్యక్రమంలో సంఘ బాధ్యులు ఊటూరి నవీన్, పెద్ది శ్రీనివాస్, అర్వపల్లి రాజేందర్, బొడ్ల రాజు ,జిల్లా ఆర్టిఏ మెంబర్ కమటాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఆదర్శ అటవీశాఖాధికారి అశోక్ రావు

**జగిత్యాల జనవరి 10(ప్రజా మంటలు)** : ఆదర్శ జిల్లా అటవీశాఖ అధికారిగా పూసాల అశోక్ రావు పేరొందారని టీ పెన్షనర్స్,సీనియర్ సిటీజేన్స్ జిల్లా అధ్యక్షుడు హరి అశోక్ కుమార్ అన్నారు.శనివారం జిల్లా సీనియర్ సిటీజేన్స్ సమావేశ మందిరంలో వయో వృద్ధుల చట్టం పై అవగాహన సదస్సు, రిటైర్డ్ జిల్లా ఆటవీ శాఖ అధికారి 65 వ జన్మదిన వేడుకలు



ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా హరి అశోక్ కుమార్ మాట్లాడుతూ వృద్ధుల సంరక్షణ విస్మరించే వారు శిక్షార్హులేనన్నారు.వృద్ధుల సంక్షేమం కోసం రాష్ట్ర స్థాయిలో సీనియర్ సిటీజేన్స్ కమిషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు .ఆదర్శ జిల్లా అటవీశాఖ అధికారిగా,జిల్లా సీనియర్ సిటీజేన్స్ ఉపాధ్యక్షుడుగా పూసాల అశోక్ రావు చేస్తున్న సేవలను కొనియాడారు. తన పదవీ కాలంలో అడవుల సంరక్షణకు అహర్నిశలు కృషి చేసి ప్రభుత్వం నుంచి అవార్డులు పొందారన్నారు. .ఈ కార్యక్రమంలో జిల్లా పెన్షనర్స్ ప్రధాన కార్యదర్శి పి.సి.హన్మంత రెడ్డి,సీనియర్ సిటీజేన్స్ జిల్లా కార్యదర్శి గౌరిశెట్టి విశ్వనాథము,కోశాధికారి వెలముల ప్రకాష్ రావు, ఎమ్.డి.యాకూబ్, రిటైర్డ్ అటవీశాఖ అధికారులు వి.పురుషోత్తమ రావు,బాలే శేఖర్,కే.సత్యన్నారాయణ,ఎమ్.డి.ఎక్బాల్, ,సింగం గంగాధర్, రాజ్ గోపాల్ చారి,బండారు ముత్తయ్య,సయ్యద్ యూసుఫ్, ప్రసాద్ ,బాలయ్య,యాకూబ్ హుస్సేన్,లచ్చయ్య, జలజ,కరుణ,సీనియర్ సిటీజేన్స్,పెన్షనర్స్ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఫకీర్ కొండాపూర్ లో ముందస్తు సంక్రాంతి సంబరాలు



**ఇబ్రహీంపట్నం జనవరి 10(ప్రజా మంటలు దగ్గుల అశోక్ ) :** ఇబ్రహీంపట్నం మండలం ఫకీర్ కొండాపూర్ గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో శుక్రవారం ప్రధానోపాధ్యాయురాలు రేణుక గారి ఆధ్వర్యంలో ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. సంక్రాంతి సంబరాలలో భాగంగా విద్యార్థిని విద్యార్థులు సాంప్రదాయ దుస్తులలో హాజరు అయ్యారు పాఠశాల ఆవరణలో జరిగిన ముగ్గుల పోటీలలో విద్యార్థినిలు వారి తల్లులతో కలసి ముగ్గులు వేశారు విద్యార్థులు అందరూ ముందుగా బోగి మంటలు వేసి పతంగులు ఎగురవేశారు సంబరాలు ఘనంగా జరుపుకున్నారు, అంతకుముందు విద్యార్థులు హరిదాసు వేషధారణతో పాటు సాంప్రదాయ వస్త్రధారణతో పాఠశాల ఆవరణ అంత పండగ సందడి నెలకొంది. ఈ కార్యక్రమానికి సర్పంచ్ తోట రమేష్ మరియు ఉపసర్పంచ్ గుంటి పుష్ప ముఖ్య అతిథిగా హాజరు అయినారు ఈ కార్యక్రమం లో సింగని మారుతి ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు మరియు విద్యార్థుల తల్లి తండ్రులు పాల్గొన్నారు.

# జాగృతి ఖతార్ చైర్‌పర్సన్‌కు నారీ శక్తి సమ్మాన్ అవార్డు




**హైదరాబాద్, జనవరి 10 (ప్రజా మంటలు) :** గల్ఫ్ కార్మికులు, ప్రవాస భారతీయులకు సేవలందిస్తున్న జాగృతి ఖతార్ అడ్వైజరీ చైర్‌పర్సన్ నందిని అబ్బగౌని నారీ శక్తి సమ్మాన్ అవార్డు అందుకున్నారు.ఖతార్‌లోని భారతీయ దౌత్య కార్యాలయం ఆధ్వర్యంలో దోహాలో జరిగిన ప్రవాసీ భారతీయ దివస్ కార్యక్రమంలో ఈ అవార్డును భారత ఎంబసీ అధికారులు ప్రదానం చేశారు. భారతీయ సమాజానికి ఆమె చేసిన సేవలు, భారత్‌ఖతార్ మైత్రి బలోపేతానికి చేసిన కృషిని గుర్తిస్తూ ఈ గౌరవం లభించింది.అవార్డు పొందిన నందినిని తెలంగాణ జాగృతి అధ్యక్షులు కల్వకుంట్ల కవిత అభినందించారు.

# శాడిజం పెరుగుతోంది సమాజంలో గతంలో కంటే హింస ఎక్కువైంది

## ప్రముఖ రచయిత యండమూరి వీరేంద్రనాథ్

## ఆవకాయ్-అమరావతి కార్యక్రమంలో ప్రతినాయకుడి పాత్రలపై

## వివరణాత్మక విశ్లేషణ ఇచ్చిన యండమూరి



వినూత్న కార్యక్రమాలు, వర్క్‌షాప్‌లతో అందరిని ఆకట్టుకుంటున్న ఆవకాయ్-అమరావతి ఉత్సవం

వినూత్న కార్యక్రమాలు, వర్క్‌షాప్‌లతో ఆవకాయ్-అమరావతి కార్యక్రమం అన్ని వర్గాల వారినీ విశేషంగా ఆకట్టుకుంటోంది. రామాయణాన్ని పప్పెట్స్ రూపంలో చూపిన ప్రదర్శన రెండో రోజు ఉత్సవాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సినిమాల్లో ప్రతినాయకుడి పాత్రలపై ప్రముఖ రచయిత యండమూరి వీరేంద్రనాథ్ చేసిన విశ్లేషణ యువతను ఆలోచింపజేసింది. ఆవకాయ అమరావతి ఉత్సవాలు రెండో రోజూ విజయవాడలోని భవానీద్వీపంలో అట్టహాసంగా సాగాయి.సినిమాల్లో ప్రేక్షకులు రెండే పాత్రలు: ప్రముఖ రచయిత యండమూరి వీరేంద్రనాథ్ సినిమాల్లో ప్రతినాయకుడి పాత్రలపై విశ్లేషణాత్మక వివరణ ఇచ్చారు. సినిమాల్లో "ప్రతినాయకుడి పాత్ర" అనే అంశంపై ఆయన స్పందిస్తూ "సినిమాల్లో ప్రేక్షకులు రెండే పాత్రలు చూస్తున్నారు. వాటిలో ఒకటి నాయకుడు, రెండోది ప్రతి నాయకుడు. నాయకుడు అంటే నీతి, నియమం గల వ్యక్తి. ప్రతి నాయకుడు అంటే సమాజానికి ద్రోహం చేసే వ్యక్తి. ఒక్కోసారి ప్రతి నాయకుడు హీరోగా కూడా సినిమాలొస్తున్నాయి. రావణాసురుడి పాత్రను హీరోగా పెట్టి సినిమాలు తీశారు. ప్రతి నాయకుడ్ని హీరోగా పెట్టి తీసే సినిమా పాత్రలకే ప్రేక్షకులు చప్పట్లు కొడుతున్నారు. సమాజంలో గతం కంటే హింసాత్మకత ఎక్కువైంది. ఇందులో ఎలాంటి సందేహం లేదు. సమాజంలో శాడిజం పెరుగుతోంది. ఎలా బతకాలన్నది నా వ్యకిగత అభిప్రాయమన్నట్లుగా కొందరు వ్యవహరిస్తున్నారు. అది కరెక్టా, కాదా? అనేది చరిత్ర చెప్పాలి. ఆవకాయ్-అమరావతి ఉత్సవాల్లో హిందీ, ఇంగ్లీషు, తెలుగు భాషల్లో జరుగుతున్న చర్చలను శ్రోతలు ఎంత వరకు అర్థం చేసుకుంటారో చూడాలి. ఇదో శుభారంభం" అని యండమూరి వీరేంద్ర నాథ్ అన్నారు.కుటుంబంలో నుంచే ఒకరు మొదట్లో విలన్‌గా: కురుక్షత్ర యుద్ధం అయిపోయాక ప్రపంచం ఏమైపోతుందోనని చాలామంది కథలు రాశారు. అంతా బతికే ఉన్నారు కదా అని యండమూరి వీరేంద్ర నాథ్ అన్నారు. ఆయన మాట్లాడుతూ "సినిమాల్లో ప్రతి నాయకుడు పలు రకాలు. కుటుంబంలో నుంచే ఒకరు మొదట్లో విలన్‌గా ఉండేవారు. మిస్సమ్మ చిత్రంలోని రమణారెడ్డి పాత్రే ఇందుకు ఉదాహరణ. 40 ఏళ్ల క్రితం నాటి సినిమాల్లోనూ భార్య పట్ల భర్తకు అనుమానం రావడం, అగ్నికి ఆజ్యం పోసినట్లుగా ఏ రాజనాలనో ఇలాంటి చిత్రాల్లో విలన్‌గా పెట్టేవారు. కాలక్రమంలో సమాజంతోపాటు సినిమాల్లోనూ విలన్ పాత్రల్లో మార్పులొస్తున్నాయి. హీరో సోదరిపై విలన్ అత్యాచారం చేయడం, కథ నాయకుడి తల్లిని చంపేసి పేగులు మెడలో వేసుకునే పాత్రలు వస్తున్నాయి. ప్రేక్షకుల్లోనూ ఇలాంటి పాత్రలపై ఆసక్తి పెరుగుతున్నందున అదే విధమైన విలన్ పాత్రలు సృష్టిస్తున్నారు. పదేళ్ల తరువాత విలన్లే హీరోలు అవుతారు. ప్రేక్షకులు ప్రతి నాయకుడి పాత్రలను ఆదరిస్తున్నారు. సినిమాలు వస్తుంటాయి, ప్రేక్షకులు చూస్తుంటారు. కురుక్షత్ర యుద్ధం అయిపోయాక ప్రపంచం ఏమైపోతుందోనని చాలామంది కథలు రాశారు. అంతా బతికే ఉన్నారు కదా"అని ప్రముఖ నవలా రచయిత యండమూరి వీరేంద్రనాథ్ ప్రశ్నించారు.ఇలాంటి కార్యక్రమాలను మరిన్ని నిర్వహించాలి: భవానీ ఐలాండ్‌లో రెండో రోజు నిర్వహించిన కార్యక్రమాల్లో మార్షల్ ఆర్ట్స్, పప్పెట్‌షో, నగాడా పిల్లలతో పాటు యువతను ఆకట్టుకుంది. అంతర్జాతీయ మార్షల్ ఆర్ట్స్ నిపుణుడు ఆదిత్య రాయ్ పిల్లలకు శిక్షణ ఇచ్చారు. మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ పట్ల పిల్లలు సంతోషం వ్యక్తం చేశారు. పున్నమి ఘాట్‌లో డ్వాక్రా సంఘాల మహిళలు, హస్త కళాకారులు ఏర్పాటు చేసిన స్టాళ్లలోని వస్తువులు ఆకట్టుకుంటున్నాయి. మాడుగుల హల్వా, ఆవకాయ సందర్శకుల నోరూరిస్తున్నాయి. ఆవకాయ్ కార్యక్రమంలోని ఏర్పాట్లపై సందర్శకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కృష్ణమ్మ తీరంలో నిర్వహించిన సంగీత విభావరి వీక్షకులను మంత్రముగ్ధుల్ని చేసింది. ఇలాంటి కార్యక్రమాలను మరిన్ని నిర్వహించాలని ప్రభుత్వాన్ని ప్రజలు కోరారు. ఈ కార్యక్రమంలో మంత్రి సత్యకుమార్ సహా పలువురు ప్రముఖులు కార్యక్రమానికి హాజరై తమ అభిప్రాయాలు పంచుకున్నారు.

# శ్రీవారిని దర్శించుకున్న ఇస్రో బృందం

## స్వామివారి పాదాల చెంత PSLV C62 రాకెట్ నమూనా

## 12వ తేదీ ఉదయం 10 గంటల 17 నిమిషాలకు శ్రీహరికోట నుంచి పీఎస్‌ఎల్‌వీ-సీ62 రాకెట్ ప్రయోగం

## తిరుమలలో PSLV జ62 రాకెట్ నమూనాకు ప్రత్యేక పూజలు

## తీర్థప్రసాదాలు అందజేసిన పండితులు



తిరుమల శ్రీవారిని ఇస్రో ఛైర్మన్ నారాయణన్ బృందం దర్శించుకుంది. శనివారం వీఐపీ ప్రారంభ విరామ దర్శన సమయంలో వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. ముందుగా పీఎస్‌ఎల్‌వీ-సీ62 రాకెట్ నమూనాతో ఆలయంలోకి వెళ్లిన ఇస్రో ఛైర్మన్ నారాయణన్ స్వామివారి పాదాల చెంత ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం రాకెట్ ప్రయోగం విజయవంతం కావాలని ప్రార్థించి మొక్కులు చెల్లించారు. దర్శన అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు ఆశీర్వచనం చేశారు. స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. 12వ తేదీ ఉదయం 10 గంటల 17 నిమిషాలకు శ్రీహరి కోట అంతరిక్ష పరిశోధన కేంద్రం నుంచి పీఎస్‌ఎల్‌వీ-సీ62 రాకెట్ నింగిలోకి వెళ్లనుంది. ఎనిమిది విదేశీ ఉపగ్రహాలను అంతరిక్షంలోకి తీసుకెళ్లనుంది.'సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ షార్ నుంచి పీఎస్‌ఎల్‌వీ-సీ62 రాకెట్‌ను జనవరి 12న ఉదయం 10.17 గంటలకు ప్రయోగిస్తాం. ఈ రాకెట్ ద్వారా భూమి పరిశీలన ఉపగ్రహం ఈఓఎస్ -ఎన్1ను కక్ష్యలోకి పంపించనున్నాం.' శ్రీకాళహస్తీశ్వరాలయాన్ని ఇస్రో ఛైర్మన్ నారాయణన్ సందర్శించారు. నూతనంగా ప్రవేశపెట్టనున్న పీఎస్ఎల్వీ జ-62 ప్రయోగం విజయవంతం కావాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న ఛైర్మన్‌కు అధికారులు స్వాగతం పలికారు. శ్రీ జ్ఞాన ప్రసూనాంబికాదేవి సమేత వాయు లింగేశ్వర స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు. వేద పండితుల మంత్రోచారణలతో ఆశీర్వచనాలు, తీర్థప్రసాదాలను అందజేశారు. తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామిని ప్రముఖ నటుడు తనికెళ్ల భరణి, తెలంగాణ మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ శ్రీవారిని దర్శించుకున్నారు. వీరు వీఐపీ ప్రారంభ విరామ దర్శన సమయంలో స్వామివారి సేవలో పాల్గొన్నారు. టీటీడీ అధికారులు వారికి స్వాగతం పలికారు. స్వామివారి దర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆలయంలోకి వెళ్లిన ప్రముఖులు స్వామివారిని దర్శించుకుని వారి మొక్కులను చెల్లించారు. దర్శన అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు ఆశీర్వచనం చేశారు. వారికి స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.తిరుమలలో టోకెన్లు లేని భక్తులకు శ్రీవారి సర్వదర్శనానికి 8 గంటలు సమయం పట్టింది. 7 కంపార్టుమెంట్లలో భక్తులు వేచి ఉన్నారు. నిన్న శ్రీవారిని 67,678 మంది భక్తులు దర్శించుకున్నారు. శ్రీవారికి తలనీలాలు 18,173 మంది భక్తులు సమర్పించారు. తిరుమలలో నిన్న శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.82 కోట్లు వచ్చిందని టీటీడీ అధికారులు తెలిపారు.

# ప్రయాణికులకు గుడ్‌న్యూస్ - హైదరాబాద్-విజయవాడ మధ్య 10 ప్రత్యేక రైళ్లు

## ప్రయాణికుల రద్దీ దృష్ట్యా హైదరాబాద్-విజయవాడ మధ్య ప్రత్యేక రైళ్లు

## ఛైర్ కార్, జనరల్ బోగీలతో నడిచే ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసిన దక్షిణ మధ్య రైల్వే



సంక్రాంతి సందర్భంగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని రైల్వేశాఖ స్పెషల్ ట్రైన్స్ వేసింది. హైదరాబాద్-విజయవాడ మధ్య 10 ప్రత్యేక రైళ్లు ఏర్పాటు చేసింది. ఎక్కువ మంది ప్రయాణికులు కూర్చుని ప్రయాణించేలా ఛైర్ కార్, జనరల్ బోగీలతో నడిచే ప్రత్యేక రైళ్లను దక్షిణ మధ్య రైల్వే ఏర్పాటు చేసింది. పండుగ ముందు, తర్వాతి రోజుల్లో ప్రత్యేక రైళ్లు రాకపోకలు సాగించనున్నాయి.ఈ నెల 11, 12, 13, 18, 19 తేదీల్లో ఉదయం 6 గంటలకు హైదరాబాద్ నుంచి విజయవాడకు ప్రత్యేక రైళ్లు నడవనున్నాయి. అదే విధంగా ఈ నెల 10, 11, 12, 17, 19 తేదీల్లో మధ్యాహ్నం 2.40 గంటలకు విజయవాడ నుంచి హైదరాబాద్‌కు ప్రత్యేక సర్వీసులు నడపనున్నారు. ఛైర్ కార్ బోగీల్లో ముందస్తు రిజర్వేషన్ చేసుకునే సదుపాయాన్ని రైల్వే శాఖ కల్పించింది. రిజర్వేషన్ చేసుకోని వారి కోసం రైలులో సగానికి పైగా జనరల్ బోగీలు ఏర్పాటు చేసింది. రైల్వే శాఖ చర్యలతో ప్రయాణ పాట్లు తగ్గుతాయని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.ప్రయాణికుల రద్దీ దృష్ట్యా: సంక్రాంతి పండుగ ముందు తర్వాతి రోజుల్లో హైదరాబాద్ నుంచి ఏపీలోని పలు ప్రాంతాలకు వెళ్లే రెగ్యులర్ రైళ్లలో 3 నెలల ముందే బెర్తులు అన్నీ నిండిపోయాయి. ప్రత్యేక రైళ్లపై ప్రయాణికులు ఆశలు పెట్టుకున్నారు. రద్దీ దృష్ట్యా హైదరాబాద్ నుంచి విజయవాడ మధ్య 10 ప్రత్యేక రైళ్లు నడవనున్నాయి.మరోవైపు ఎక్కువ మంది ప్రయాణించే 13వ తేదీన ఉన్న 3 ప్రత్యేక రైళ్లలో టికెట్లు బుకింగ్ చేసుకునేందుకూ అవకాశం లేదు. హైదరాబాద్ నుంచి విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి, అనంతపురం, కడప, చిత్తూరు కాకినాడ, రాజమహేంద్రవరం తదితర ప్రాంతాలకు వెళ్లే రైళ్లలోను కూడా దాదాపు ఇదే పరిస్థితి. ఒక్క సీటూ లేదు. పలు రైళ్లలో కనీసం టికెట్ రిజర్వేషన్ చేసుకునే సదుపాయం కూడా లేకుండా రిగ్రెట్ వస్తోంది. దీంతో రైలు ఎలా ఎక్కాలో తెలియక ప్రయాణికులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.హైదరాబాద్-విజయవాడ హైవేపై వాహనాల రద్దీ: సంక్రాంతి నేపథ్యంలో సొంతూళ్లకు వెళ్తున్న వారితో హైవేపై వాహనాల రద్దీ భారీగా పెరిగింది. కృష్ణా జిల్లా ఉంగుటూరు మండలం పొట్టిపాడు టోల్ గేట్ వద్ద వాహనాల రద్దీ పెరిగింది. వాహనాలను నియంత్రించలేక టోల్ గేట్ వద్ద ఇబ్బందులు ఏర్పడ్డాయి.ఎన్టీఆర్ జిల్లా నందిగామలో విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై వాహనాలు బారులు తీరాయి. నందిగామ వై జంక్షన్ వద్ద ట్రాఫిక్ లో ముందుకు వెళ్ళడానికి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో వాహనాలు రహదారిపై నిదానంగా ముందుకు సాగుతున్నాయి. హైదరాబాద్, ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వాహనదారులతో కీసర టోల్ ప్లాజా కిటకిటలాడుతుంది. వాహనాల రద్దీ దృష్ట్యా ట్రాఫిక్ జామ్ అవ్వకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.ప్రత్యేక బస్సులు కేవలం 240 మాత్రమే: రైళ్లలో సీటు దొరక్కపోయినా ఆర్టీసీ బస్సుల్లో సొంతూళ్లకు వెళదామనుకునే వారి ఆశలు ఈసారి అడియాశలు అయ్యాయి. హైదరాబాద్ నుంచి పెద్ద ఎత్తున వచ్చే వారికి ఈసారి సరిపడ బస్సులు ఏర్పాటు చేయలేదు. ఏర్పాటు చేసిన బస్సులు ఏ పాటికీ సరిపోవడం లేదు. ప్రస్తుతం ఏ ఒక్క బస్సులోనూ ఒక్క సీటు కూడా ఖాళీగా లేదు. ఈ నెల 9 నుంచి 13వ తేదీ వరకు అత్యధిక రద్దీ నెలకొంది.హైదరాబాద్ నుంచి విజయవాడకు నడిచే బస్సులు అన్నింటిలోనూ టికెట్లు అయిపోయాయి. ఈ రూట్లో అన్ని రోజుల్లో కలిపి ఆర్టీసీ కేవలం 240 ప్రత్యేక బస్సులు మాత్రమే ఏర్పాటు చేసింది. సగటున రోజుకు 20 ప్రత్యేక బస్సులు మాత్రమే ఉండగా వేటిలోనూ సీట్లు లేవు. ఈ నెల 9, 10, 11, 12, 13న హైదరాబాద్-విజయవాడ మధ్య నడిచే ఏ ఒక్క బస్సులోనూ ప్రస్తుతం సీట్లు ఖాళీగా లేవు. హైదరాబాద్ నుంచి వచ్చే ప్రయాణికులు ప్రత్యామ్నాయం చూసుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.రైళ్లు, బస్సులు నిండిపోవడంతో ప్రైవేటు ట్రావెల్స్‌లో వెళ్దామని ప్రయత్నిస్తే నిలువునా దోచేస్తున్నారు. విమానాలతో సమానంగా ఛార్జీలు వసూలు చేస్తూ జేబులు ఖాళీ చేస్తున్నారు. హైదరాబాద్-విజయవాడ మధ్య గరిష్టంగా టికెట్ ఖరీదు రూ.5000 వరకు ఉందంటే దోపిడీ ఏ స్థాయిలో ఉందో తెలుసుకోవచ్చు.

# తెలుగు రాష్ట్రాల్లో తొలి టోటల్ ల్యాబొరేటరీ ఆటోమేషన్‌ను ప్రారంభించిన కిమ్స్ హాస్పిటల్స్

## టీఎల్‌ఏ ల్యాబొరేటరీని విజయవంతంగా ప్రారంభించిన కిమ్స్ హాస్పిటల్

## రెండు తెలుగు రాష్ట్రాల్లో తొలిసారి సాంకేతికతగా నిలిచిన ల్యాబొరేటరీ

## ముఖ్య అతిథిగా హాజరైన కిమ్స్ సీఎండీ డా.భాస్కర్ రావు



సికింద్రాబాద్ కిమ్స్ హాస్పిటల్‌లో ల్యాబొరేటరీలో అత్యాధునిక టోటల్ ల్యాబొరేటరీ ఆటోమేషన్ వ్యవస్థను విజయవంతంగా ప్రారంభించింది. ఈ కార్యక్రమానికి కిమ్స్ గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డా.బి.భాస్కర్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ ల్యాబొరేటరీ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో తొలిసారి అమలు చేసిన సాంకేతికతగా నిలిచింది. దీంతో కిమ్స్ హాస్పిటల్‌లో కచ్చితమైన నిర్ధారణ, వేగవంతమైన సేవలు, నాణ్యమైన రోగి సంరక్షణకు నిబద్ధతను మరింత బలపరిచింది. ఈ కార్యక్రమంలో సీఎండీతో పాటు మెడికల్ డైరెక్టర్ డా.సంబిత్ సాహు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కిమ్స్ హాస్పిటల్స్ చీఫ్ ఆఫ్ ల్యాబొరేటరీ మెడిసన్ డా.రాధికా చౌదరి, కన్సల్టెంట్ బయోకెమిస్ట్ డా.మహమ్మద్ మొయినుద్దీన్ మాట్లాడుతూ టోటల్ ల్యాబొరేటరీ ఆటోమేషన్ ద్వారా మానవ ప్రీ-అనలిటికల్, అనలిటికల్ లోపాలు తగ్గుతాయని, బయో సేఫ్టీ మెరుగువుతుందని, పరీక్షల ఫలితాలు వేగంగా అందుతాయని పేర్కొన్నారు.నాణ్యమైన వైద్య సేవలు అందించాలని : అంతేకాకుండా వర్క్ ఫ్లో పూర్తిగా సమగ్రంగా పని చేయడం, ఆధునిక డ్రై కెమిస్ట్రీ సాంకేతికతకు మారడం వలన నాణ్యత స్థిరంగా ఉండటం, వనరుల సమర్థ వినియోగం, వైద్య నిర్ణయాలు వేగంగా తీసుకోవడం సాధ్యమవుతుందని తెలిపారు. దీని ద్వారా పేషెంట్ సర్జరీతో ఫలితాలు మరింత మెరుగవుతాయని పేర్కొన్నారు. ఈ ప్రారంభంతో కిమ్స్ ఆసుపత్రిలో అధునిక డయాగ్నోస్టిక్స్‌లో వారి సేవలను బలోపేతం చేస్తూ, రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే దృష్టితో మరింత ముందుకు తీసుకెళ్తోందని భావిస్తున్నారు.

**టీఎల్‌ఏ వల్ల ఉపయోగాలు :**

ఈ టీఎల్‌ఏ వ్యవస్థ ద్వారా సాధారణ, అత్యవసర పరీక్షల సమయం తగ్గడం.

పరీక్ష ఫలితాల్లో స్థిరత్వం పెరగడం.

రోగి భద్రత మెరుగవడం.

ఎక్కువ సంఖ్యలో నమూనాలను సమర్థవంతంగా నిర్వహించగల సామర్థ్యం లభిస్తాయి.ప్రీ-ఎనలిటికల్, ఎనలిటికల్, పోస్ట్-ఎనలిటికల్ ప్రక్రియ కోసం అధునాతన ఆటోమేషన్ ఉపయోగిస్తాయి. ఇందులో మాన్యువల్ ఎర్రర్, టర్నరౌండ్ సమయాలను తగ్గించే ఆటోమేటెడ్, బార్‌కోడ్, ట్రాక్-ఆధారిత వ్యవస్థలు ఉన్నాయి. ఇది 24/7 సేవలు అందిస్తుంది. ఈ ప్రయోగశాలలు కెమిస్ట్రీ, హెమటాలజీ, ఇమ్యునాలజీ, మైక్రోబయాలజీ, మాలిక్యులర్ బయాలజీ, సైటోజెనెటిక్స్, ఫ్లో సైటోమెట్రితో సహా విస్తృత శ్రేణి సేవలను అందిస్తాయి.ఈ ప్రయేగశాలలు వేగవంతమైన, కచ్చితమైన ఫలితాలను అందించడానికి సహాయపడే విధంగా నిర్గమాంశ పరీక్ష, మాలిక్యులర్ డయాగ్నస్టిక్స్ వంటి అత్యాధునిక పరికరాలతో అమర్చారు. ఈ కిమ్స్ హాస్పిటల్‌లోని కేంద్ర ప్రయోగశాల ఎన్ఏబీఎల్ అక్రిడిటేషను కలిగి ఉంది. ఇది అధిక నాణ్యత, ప్రామాణిక పరీక్షను నిర్ధారిస్తుంది.

# నేడే తెలంగాణ విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ ఐక్య సంఘం జనరల్ బాడీ



**భీమదేవరపల్లి జనవరి 10 (ప్రజా మంటలు) :** తెలంగాణ విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ ఐక్య సంఘం ఆధ్వర్యంలో జనరల్ బాడీ సమావేశాన్ని ఆదివారం హనుమకొండలోని కీర్తి గార్డెన్స్ (భద్రకాళి ఆలయం ముందు) నిర్వహించనున్నట్లు సంఘం నాయకులు తెలిపారు. ఈ సమావేశంలో సంఘ భవిష్యత్తు కార్యాచరణపై, వృత్తి భద్రత అంశాలపై విస్తృతంగా సమాలోచనలు జరగనున్నట్లు తెలిపారు. గ్రామ కమిటీ, మండల కమిటీ, జిల్లా కమిటీ, రాష్ట్ర కమిటీ సభ్యులతో పాటు విశ్వబ్రాహ్మణ కుల బంధువులందరూ అధిక సంఖ్యలో పాల్గొని తమ సమస్యలు, సూచనలు తెలియజేసి సమావేశాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర అధ్యక్షులు ఎర్రోజు బిక్షపతి చారి పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నౌండ్ల సంతోష్ చారి, రాష్ట్ర సహాయ కార్యదర్శి కలకోటి శ్రీధర్, హనుమకొండ జిల్లా అధ్యక్షులు శృంగారపు వెంకటేశ్వర చారి, వరంగల్ జిల్లా అధ్యక్షులు మాటూరి రమేష్ చారి, వరంగల్ జిల్లా ఉపాధ్యక్షులు పంచకోటి సాంబమూర్తి, హనుమకొండ జిల్లా కార్యదర్శి రుద్రోజు మహీంద్రా చారి, జిల్లా యూత్ అధ్యక్షులు బానోజు రవీంద్ర చారితో పాటు సీనియర్ నాయకులు వెల కంటి రామ్మూర్తి, సిద్ధోజు విద్యాసాగర్ (ఓపి జిల్లా అధ్యక్షులు), భలే భోజు వెంకన్న, కలవచర్ల శ్రీనివాస చారి, వనపర్తి శ్రీనివాస్, శ్రీ పల్లి శ్రీనివాస్, చల్లూరి లింగస్వామి, ఈ నరేందర్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమకారులకు 250 గజాల స్థలం ఇవ్వకపోతే భూపోరాటాలు తప్పవు: తెలంగాణ జాగృతి



**హైదరాబాద్, జనవరి 10 (ప్రజా మంటలు) :** తెలంగాణ ఉద్యమకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు పోరాటం కొనసాగిస్తామని తెలంగాణ జాగృతి వర్కింగ్ ప్రెసిడెంట్ రూప్ సింగ్ హెచ్చరించారు. ముఖ్యంగా ఉద్యమకారులకు హామీ ఇచ్చిన 250 గజాల భూమిని వెంటనే కేటాయించాలని డిమాండ్ చేశారు.బంజారాహిల్స్‌లోని జాగృతి కార్యాలయంలో జరిగిన ఉద్యమకారులతో ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడుతూ, ఇప్పటికే కరీంనగర్‌లో భూపోరాటం ప్రారంభమైందని, మిగతా జిల్లాల్లోనూ ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాలను ఉద్యమకారులు గుర్తించాలని సూచించారు. ఆయా ప్రాంతాల్లో కవిత స్వయంగా భూపోరాటం నిర్వహించి స్థలాలు ఇప్పించే బాధ్యత తీసుకుంటారని తెలిపారు.ఉద్యమకారుల విషయంలో ప్రభుత్వం చిత్తశుద్ధి చూపడం లేదని విమర్శించారు. ఉద్యమకారుల సమస్యలపై అన్ని సంఘాలతో కలిసి జాగృతి పనిచేస్తుందని, ఉద్యమంలో నష్టపోయిన యూనివర్సిటీ విద్యార్థులకు న్యాయం చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో వివిధ ఉద్యమకారుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# హనీ ట్రాప్ లో బట్టు రాజశేఖర్ కి ఏలాంటి సంబంధం లేదు.

## మహిళా సంఘాల మద్దతు.



**ఇబ్రహీంపట్నం జనవరి 10(ప్రజా మంటలు దగ్గుల అశోక్ ) :** కోరుట్ల నియోజకవర్గంలో హనీ ట్రాప్ కేసు విషయంలో ఎర్దండికి చెందిన బట్టు రాజశేఖర్ ను కావాలని ఇరికించారని మహిళా సంఘాల సభ్యులు అన్నారు, శేఖర్ బాధితుడే తప్ప నిందితుడు కాదని అన్నారు, శేఖర్ పై మాకు పూర్తి నమ్మకం ఉందనీ, ఎక్కడ ఎలాంటి తప్పులు లేకుండా ఊరిలో మెదిలాడని మహిళల పట్ల గౌరవంతో ఉండేవాడని మహిళలకు ఎప్పుడు మద్దతుగా ఉండి వారి కొరకు పోరాటం చేసిన వ్యక్తే కానీ ఎలాంటి తప్పుడు పనులు చేసిన వ్యక్తి కాదని, ఇది కచ్చితంగా శేఖర్ ను కావాలని ఉద్దేశపూర్వకంగా ఇరికించారని మేము నమ్ముతున్నాము, మాకు పోలీసులపైన చట్టం పైన పూర్తి నమ్మకం ఉంది. ఎప్పటికైనా న్యాయం గెలుస్తుంది నిజా నిజాలు త్వరలో తెలుస్తాయి అన్నారు.కార్యక్రమంలో మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# అఖిల బ్రాహ్మణ సేవా సంఘ నూతన సంవత్సర కాలెండర్ ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్



**జగిత్యాల జనవరి 10 )ప్రజా మంటలు) :** జగిత్యాల బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన 2026 నూతన సంవత్సరం సంబంధించిన క్యాలెండర్ను జగిత్యాల శాసన సభ్యులు దా సంజయ్ కుమార్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు గాజంగి నందయ్య మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ అడవాల జ్యోతి లక్ష్మణ్ తో కలిసి ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మాట్లాడుతూ జగిత్యాల పొలాస ధర్మపురి కొండగట్టు అయ్యగార్లచే తమకు మొదటి నుంచి అనుబంధం ఉన్నదని అన్నారు తమ ఇంటి నుండి బ్రాహ్మణ వాడ ప్రారంభమవుతుందని శ్రీరామ మందిరంలో కొంత భాగం శిథిలం కాగా తిరుమల తిరుపతి దేవస్థానం ప్రభుత్వం దాతల సహకారం చే ధ్యాన మందిరం నిర్మించుకోవడం జరిగిందని గుర్తు చేశారు.నిర్మాణానికి సహకరించిన దాతలకు అధికారులకు తిరుమల తిరుపతి దేవస్థానం వారికి ఈ సందర్భంగా సహకార అందించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.సర్వేజనా సుఖినోభవంతు అని ప్రతినిత్యం ఆశీస్సులు అందజేసే బ్రాహ్మణ పెద్దల ఆశీస్సులు తనకు ఎల్లప్పుడూ ఉంటాయని అన్నారు.ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ ప్రతినిధులు సభాపతి తిగుళ్ల సూర్యనారాయణ శర్మ, మోతే ఉమాకాంత్ శర్మ, మేడిపల్లి శ్రీనివాస్ శర్మ, కొత్తపల్లి శ్రీనివాస్ శర్మ, సిరిసిల్ల రఘుపతి శర్మ, గోవర్ధన్ శర్మ, శ్రీధర్ గణపతి, చాకుంట వేణు మాధవరావు మాధవరావు, మెట్ట కిరణ్, సిరిసిల్ల పార్థసారథి శర్మ తదితరులు పాల్గొన్నారు

# మున్సిపల్ ఎన్నికల్లో అత్యధిక మెజారిటీ తో గెలువబోతున్నట్లు ఆశభావం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్



**మెట్టుపల్లి జనవరి 10 (ప్రజ మంటలు దగ్గుల అశోక్ ) :** జగిత్యాల జిల్లా మెట్టుపల్లి లో ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ తన నివాసంలో మీడియా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ....నియోజకవర్గంలో ని ఆటో, టాక్సీ డ్రైవర్లకు లైఫ్ ఇన్సూరెన్స్, హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీలు స్వయంగా కల్పిస్తున్నట్లు ఎమ్మెల్యే అన్నారు. రెండు సంవత్సరాలలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు చేసిందేమి లేదని ఏద్దేవా చేశారు.కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు,ప్రజలకు ప్రత్యేకంగా ఎటువంటి నిధులు కేటాయించట్లేదని అందువల్ల రాష్ట్రా అభివృద్ధి కుంటుపడి తెలంగాణ ప్రజలు అన్యాయం అయ్యారని, ఈ పరిస్థితి బిఆర్ఎస్ లేదని గుర్తు చేశారు. రానున్న మున్సిపల్, ఎంపిటీసీ, జడ్పీటీసీ ఎన్నికలలో బిఆర్ఎస్ పార్టీ అత్యధిక మెజారిటీల్లో గెలుస్తున్నట్లు ఆశభావం వ్యక్తం చేశారు.

# సీనియర్ జర్నలిస్ట్ మహేష్ చారికి పరామర్శ

## టి ఆర్ ఆర్ ఎస్ జిల్లా అధ్యక్షుడు హింగే భాస్కర్



**ఎల్కతుర్తి జనవరి 10 ప్రజా మంటలు :** ఎల్కతుర్తి మండల కేంద్రానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్, మీడియా రిపోర్టర్ కందుకూరి మహేష్ చారి కొన్ని రోజులుగా అనారోగ్య కారణాలతో హనుమకొండ లోని ఓజస్ హాస్పిటల్‌లో చికిత్స పొంది తన స్వగ్రామం ఎల్కతుర్తికి చేరుకున్న విషయం తెలుసుకున్న తెలంగాణ రైతు రక్షణ సమితి హనుమకొండ ఉమ్మడి కరీంనగర్ జిల్లాల అధ్యక్షుడు హింగే భాస్కర్ సీనియర్ జర్నలిస్ట్, మీడియా రిపోర్టర్ కందుకూరి మహేష్ చారిని ఆరోగ్య పరిస్థితిని అడిగి పరామర్శించారు.ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ మహేష్ చారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.అనంతరం ఆయనకు ధైర్యం నింపి అధైర్య పడద్దని మేమందరం ఉన్నామని ధైర్యం ఇచ్చారు. అలాగే ఆయన పూర్తిగా త్వరగా కోలుకుని మళ్లీ జర్నలిజం రంగంలో క్రియాశీలకంగా కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో హింగే రవీందర్, కందుకూరి రాజన్న, నల్ల రాజిరెడ్డి, శ్రీరామోజు సతీష్ చారి, సదానిరంజన్ సిద్ధాంతి, అంబాల ప్రవీణ్, భాష బోయిన కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI S HARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI . TELTEL/2021/81092 : PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com